మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 17-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 318 Issue: 318

17 మే 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:37 తిథి పాడ్యమి రా. 9:41 వరకు తరువాత విదియ సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం కృతిక మ. 2:31 వరకు తరువాత రోహిణి యోగం శోభన ఉ. 6:13 వరకు కరణం స్తుఘ్నమ ఉ. 11:36 వరకు బవ రా. 9:41 వరకు వర్జ్యం తె. 4:31 నుండి తె. 5:55 వరకు దుర్ముహూర్తం సా. 4:54 నుండి సా. 5:46 వరకు రాహుకాలం సా. 5:01 నుండి సా. 6:37 వరకు యమగండం మ. 12:12 నుండి మ. 1:48 వరకు గుళికకాలం మ. 3:25 నుండి సా. 5:01 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు మ. 12:29 నుండి మ. 1:53 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




# భగీరథ్ సరెండర్

**పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన కుటుంబసభ్యులు**

**14 రోజుల రిమాండ్.. చర్లపల్లి జైలుకు తరలింపు**

**న్యాయ సలహాతోనే లొంగుబాటు ఆలస్యం: బండి సంజయ్**

**లొంగిపోలేదు.. మేమే అరెస్టు చేశాం: సైబరాబాద్ సీపీ**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు, పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. భగీరథ్ తన లాయర్ల సమక్షంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారులకు లొంగిపోయాడు. పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు.

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): అంతకు ముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అనంతరం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టుకు తీసుకువచ్చారు.కాగా, కేసు నమోదై 9 రోజులైనా అతని ఆచూకీ కనిపెట్టడంలో తెలంగాణ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని.. నిందితుడిని పట్టుకోవడంలో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో దర్యాప్తును వేగవంతం చేశారు. కరీంనగర్, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లో విస్తృతంగా గాలించారు. శనివారం సాయంత్రం వరకూ అతని తరువాయి 2 వ పేజీలో...

# మిడిల్ క్లాస్ లగ్జరీ

## అప్పు చేసైనా ఆర్భాటం తగ్గొద్దు

**మారుతున్న మధ్యతరగతి ముఖచిత్రం**

**ప్రతి ఇల్లూ ఓ మినీ రాజమహల్**





"ఒకప్పుడు అవసరాలకు మాత్రమే పరిమితమైన మధ్యతరగతి కుటుంబాల జీవనశైలి పూర్తిగా మారిపోయింది. ఇల్లు దాటితే కారు.. ఇంట్లో అడుగుపెడితే ఏసీ, విలాసవంతమైన సోఫాలు, మోడ్యులర్ కిచెన్‌లు, అధునాతన చిమ్నీలు.. ఇప్పుడు సర్వసాధారణం అయిపోయాయి. తమ ఆర్థిక స్థోమతకు మించి, అప్పులు చేసైనా సరే 'లగ్జరీ లైఫ్'ను అనుభవించాలనే ఆరాటం పెరిగిపోతోంది.

ఈవార్తలు సండే స్టోరీ

సమాజంలో తమ 'స్టేటస్'ను ప్రదర్శించు కునేందుకు, దర్పాన్ని ఒలకబోసేందుకు ఏమాత్రం వెనుకాడని నేటి మిడిల్ క్లాస్ మైండ్‌సెట్‌పై ప్రత్యేక కథనం..గతంలో ఏసీ అనేది పెద్దల ఇళ్లలో మాత్రమే కనిపించే విలాసం.. ఇప్పుడది కనీస అవసరం. ఇల్లు కట్టుకోవడం లేదా అద్దెకు దిగడం వరకే ఒకప్పటి ఆలోచన పరిమితం. కానీ, ఇప్పుడు ఇంటీరియర్ డిజైనింగ్‌కు లక్షలు ఖర్చు చేస్తున్నారు. గోడల నిండా ఆకర్షణీయమైన కబోర్డులు, వంటగదిలో మోడ్యులర్ ఫిట్టింగ్స్, పొగ రాకుండా కాస్ట్లీ చిమ్నీలు, హాలులో ఖరీదైన సోఫాలు ఉండాల్సిందే. పక్కింటి వారి కంటే తమ ఇల్లు మరింత అధునాతనంగా కనిపించాలనే పోటీ పెరిగింది. ఈ ఆర్భాటం కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు నేటి తరం సిద్ధపడుతోంది. ఈ 'లగ్జరీ' మోజుకు ప్రధాన కారణం సులభంగా లభిస్తున్న అప్పులే. ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా సులభ వాయిదాల (ఈఎంఐ) పద్ధతి అందుబాటులో ఉండటం మధ్యతరగతిని విలాసాల వైపు పరుగులు తీయిస్తోంది. జేబులో డబ్బులు లేకపోయినా క్రెడిట్ కార్డులు గీకేస్తున్నారు. చేతికి వచ్చే జీతం సగం పైగా ఈఎంఐలకే పోతున్నా, తమ జీవనశైలిని మాత్రం తరువాయి 2 వ పేజీలో...



# 9వ తరగతి నుంచి త్రిభాషా విధానం

**జూలై 1 నుంచే అమలు: సీబీఎస్ఈ**

**పరీక్షల్లో మూడో భాష పేపర్‌కు మినహాయింపు**

న్యూఢిల్లీ: త్రిభాషా విధానంపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకెండరీ ఎడ్యుకేషన్ ( సీబీఎస్ఈ ) కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది, పది తరగతులకు త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేసింది. ఈ విద్యా సంవత్సరం అంటే తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,791 |
| వెండి (కిలో): | రూ.3,05,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,154 |

# 31 నాటికి తెలంగాణకు నైరుతి

**జూన్ 1-2 తేదీల్లో రాష్ట్రమంతా విస్తరణ**

**24న కేరళను తాకనున్న రుతుపవనాలు**

మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ విభాగం ఎట్టకేలకు చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందే దేశంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు.. ఈసారి ఐదు రోజులు ముందుగానే అంటే మే 26 నాటికే కేరళను తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

న్యూఢిల్లీ: వాతావరణంలో వస్తున్న మార్పుల ఆధారంగా మే 22 నుంచి మే 30 మధ్య కాలంలో ఎప్పుడైనా ఇవి కేరళ తీరాన్ని తాకవచ్చని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు సైతం రుతుపవనాల రాక ముందస్తుగానే ఉండబోతోంది. సాధారణంగా కేరళ తీరాన్ని తాకిన ఐదు రోజుల తర్వాత రుతుపవనాలు రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లోకి ప్రవేశిస్తాయి. గతేడాది - 2 వ పేజీలో...



# వెండి దిగుమతులపై కఠిన ఆంక్షలు

**నియంత్రిత విభాగంలోకి సిల్వర్**

**విదేశీ మారకపు నిల్వల రక్షణకే!**



ఇరాన్, అమెరికా మధ్య యుద్ధంతో పశ్చిమాసియా సంక్షోభం వేళ ఇటీవల బంగారం, వెండి వంటి విలువైన లోహాలపై దిగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. తాజాగా, కేంద్రం వెండి దిగుమతులపై ఆంక్షలు విధించింది. స్వేచ్ఛా దిగుమతి జాబితా నుంచి తొలగించి.. నియంత్రిత దిగుమతి కేటగిరీలోకి వెండిని చేర్చింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ఫారిన్ ట్రేడ్ డైరెక్టరేట్ జనరల్ ఓ ప్రకటనలో తెలిపింది.

న్యూఢిల్లీ: ఆంక్షల విభాగంలోని వస్తువులను దిగుమతి చేసుకోవాలంటే ప్రభుత్వ లైసెన్స్ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. కొన్ని ఉత్పత్తుల విషయంలో ఆర్బీఐ నిబంధనలు కూడా వర్తిస్తాయి. దేశంలో పెరుగుతున్న బంగారం, వెండి దిగుమతి ఖర్చులను నియంత్రించడం,-2 వ పేజీలో...

## విశ్వవాణి



థాయిలాండ్‌లో ప్రతి ఏటా ఒకరోజు కోతులకు బుఫే అందజేస్తారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో అవి కీలకంగా వ్యవహరిస్తున్నాయన్న కారణంతో ఇలా పండ్లు, ఫలాలతో భారీ విందు ఏర్పాటు చేస్తారు.

# 'సర్' ఏం చేస్తారో..?

## అన్ని పార్టీల చూపు ఓటర్ల జాబితా సవరణపైనే

**క్షేత్రస్థాయి పరిస్థితులపై ఏ పార్టీకా పార్టీ అంచనాలు.. త్వరలో ప్రారంభం కానున్న ప్రక్రియ**



రాష్ట్ర రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న వేళ, "సర్" ప్రారంభంపై అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ఇది కేవలం ఒక కార్యక్రమం కాకుండా, భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే వేదికగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

హైదరాబాద్, మే 16 (ఈవార్తలు): ముఖ్యంగా యువత, ఉద్యోగులు, సామాజిక వర్గాలపై దీని ప్రభావం ఎంత మేర ఉంటుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. అందుకే అన్ని రాజకీయ పార్టీలు దీనిపై తమ తమ వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, "సర్" ప్రభావం సామాజిక వర్గాల్లో ఎంత మేరకు ఉంటుందనేదే భవిష్యత్ రాజకీయాలపై కీలకంగా మారే అవకాశం ఉంది. అధికార పార్టీ దీన్ని అభివృద్ధి, సంక్షేమ కోణంలో ప్రచారం చేస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం ప్రజల సమస్యలను ముందుకు తెచ్చే ప్రయత్నంలో ఉన్నాయి. ఇప్పటికే సోషల్ మీడియా వేదికల్లో "సర్" గురించి చర్చలు జోరందుకున్నాయి. అనేక వర్గాలు దీన్ని స్వాగతిస్తుండగా, మరికొన్ని వర్గాలు స్పష్టత కోరుతున్నాయి.




# రేపు తిరుమల ఆగస్టు కోటా విడుదల

తిరుమల, మే 16 (ఈవార్తలు): తిరుమల వేంకటేశ్వర స్వామి వివిధ దర్శనాలు, గదులు ఆగస్టు నెలకు సంబంధించి కోటా వివరాలను టీటీడీ వెల్లడించింది. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన కోటాను మే 18న

# మూడో బిడ్డకు 30,000.. నాలుగో బిడ్డకు 40,000

**ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన.. జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు**



మూడో బిడ్డకు రూ.30 వేలు.. నాలుగో బిడ్డకు రూ.40 వేలు.. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం చేసిన ఈ ప్రకటనపై ఇప్పుడు పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించిన సీఎం చంద్రబాబు.. అక్కడ నిర్వహించిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడవ బిడ్డ పుడితే రూ. 30,000, నాలుగవ బిడ్డకు రూ. 40,000 చొప్పున ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను నెల రోజుల్లోగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.

శ్రీకాకుళం, మే 16 (ఈవార్తలు): బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే తల్లిదండ్రులకు ఈ సాయం అందిస్తామని ప్రకటించారు. గతంలో కుటుంబ నియంత్రణ పాటించాలని కోరిన చంద్రబాబు.. ఇప్పుడు మరింత మంది పిల్లలను కనాలని దంపతులను కోరటంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. మరోవైపు రెండో బిడ్డకు జన్మనిచ్చిన దంపతులకు రూ. 25 వేలు అందించే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. మార్చి ఐదో తేదీన అసెంబ్లీ వేదికగా చంద్రబాబు -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

17.5.2026

మేషం: ఇంటాబయట ఊహించని సమస్యలు కలుగుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు. దైవ చింతన పెరుగుతుంది.

వృషభం: ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలు లాభాల బాటలో నడుస్తాయి. ఇంటాబయట ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగాలలో ఇతరులతో సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

మిధునం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సోదరులతో ఆస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి ఉన్నది. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలు సజావుగా సాగుతాయి.

కర్కాటకం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి అధికమవుతుంది. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. చేపట్టిన పనులలో శ్రమ తప్పకపోవచ్చు. ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది.

సింహం: ముఖ్యమైన పనులలో శ్రమపడ్డా ఫలితం ఉండదు. వ్యాపార వ్యవహారాలలో వ్యయప్రయాసలు అధికమవుతాయి. ఆర్థిక ఇబ్బందులు మరింత బాధిస్తాయి. బంధువులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. నిరుద్యోగులకు కొంత నిరాశ తప్పదు.

కన్య: దైవ సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. మిత్రుల నుంచి అవసరానికి ధనసహాయం లభిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చేపట్టిన ప్రతి పనిలో పరిస్థితులు మరింత అనుకూలిస్తాయి. విద్యార్థులకు శుభవార్తలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటాయి.

తుల: కొన్ని సంఘటనలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

వృశ్చికం: బంధుమిత్రుల నుంచి ఋణ ఒత్తిడులు అధికమవుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు అమలు చేయడం మంచిది కాదు. ముఖ్యమైన పనులు శ్రమానంతరం పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఉద్యోగాలలో అంచనాలను అందుకోవడంలో విఫలమవుతారు.

ధనస్సు: బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. ధన పరంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. అనుకున్న వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. ఆర్థిక లావాదేవీలు మరింత మందగిస్తాయి. వ్యాపారాలలో భాగస్వాములతో మాటపట్టింపులు ఉంటాయి. ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి.

మకరం: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహన యోగం ఉన్నది. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. నూతన వ్యక్తుల పరిచయాలు ఆనందం కలిగిస్తాయి. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపార ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కుంభం: ముఖ్యమైన పనులలో శ్రమాధిక్యత అధికమవుతుంది. వృత్తి వ్యాపారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు పని భారం వలన ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన వ్యవహారాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. నిరుద్యోగ ప్రయత్నాలు వాయిదా పడతాయి.

మీనం: ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. సన్నిహితుల నుండి శుభవర్తమానాలు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారాలు లాభిస్తాయి.

# మిడిల్ క్లాస్ లగ్జరీ

మొదటి పేజీ తరువాయి

తగ్గించుకోవడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. భవిష్యత్తు ఆదాయాన్ని ముందే ఊహించుకుని మరీ అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. చాలా ఇళ్లలో కొనుగోలు చేస్తున్న వస్తువులు అవసరం కొద్దీ కొన్నవి కావు.. కేవలం ప్రదర్శన కోసమే. ఇంటికొచ్చిన బంధువులు, స్నేహితుల ముందు తమ దర్పం చూపించుకునేందుకు అనవసరమైన ఖర్చులు చేస్తున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా ప్రభావం కూడా తీవ్రంగా ఉంటోంది. అందులో చూసిన ప్రతి ట్రెండ్‌ను ఫాలో అవ్వాలనే తపనతో, తమ బడ్జెట్‌ను లెక్కచేయకుండా డెకరేషన్లు, గాడ్జెట్ల మోజులో పడిపోతున్నారు.

### ఆర్థిక క్రమశిక్షణ ఎక్కడ?

ఒకప్పుడు భారతీయుల రక్తంలోనే పొదుపు ఉండేది. రాబోయే కష్టకాలం కోసం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసా పైసా కూడబెట్టేవారు. కానీ నేటి ట్రెండ్ 'సంపాదించు - ఖర్చు పెట్టు'. రేపటి గురించి ఆలోచించే తీరిక, ఓపిక నేటి యువతకు, మధ్యతరగతి కుటుంబాలకు లేకుండా పోయింది. ఈ లగ్జరీ లైఫ్ కోసం చేస్తున్న అప్పులు, భవిష్యత్తులో ఉద్యోగాల కోత లేదా ఆర్థిక మాంద్యం లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైతే తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. కష్టపడి సంపాదించిన డబ్బుతో సౌకర్యవంతమైన జీవితాన్ని గడపాలనుకోవడం ఏమాత్రం తప్పు కాదు. కానీ, ఇక్కడే గీత దాటుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. 'సౌకర్యం' కాస్తా 'విలాసం'గా మారి, ఆ విలాసం కాస్తా 'ప్రదర్శన'గా మారినప్పుడే అసలు సమస్య మొదలవుతుంది. తమ జేబులో ఉన్నదాని కంటే, పక్కవాడి దృష్టిలో తమ స్థాయి ఎలా ఉందనేదే ఇప్పుడు చాలామందికి ప్రామాణికంగా మారిపోయింది.

### ఆపదలో ఆదుకునేది ఏది?

కరోనా లాంటి విపత్కర పరిస్థితులు, లేదా అకస్మాత్తుగా వచ్చే ఆర్థిక మాంద్యాలు మనకు నేర్పిన అతి పెద్ద పాఠం 'పొదుపు'. ఇంట్లో ఎవరికైనా అనారోగ్యం చేసినప్పుడు లేదా ఆకస్మికంగా ఉద్యోగం పోయినప్పుడు.. ఆదుకునేది బ్యాంకులో ఉన్న పొదుపు మొత్తమే తప్ప, ఇంట్లో అలంకారం కోసం లక్షలు పోసి కొన్న సోఫాలు, ఏసీలు కావు. విలాసాల మీద పెట్టే ఖర్చును, కష్టకాలం కోసం ఏర్పరుచుకునే 'ఎమర్జెన్సీ ఫండ్'గా మార్చుకోగలిగితే అదే నిజమైన ఆర్థిక భద్రత. ఈ రోజుల్లో అప్పు చేయడం, ఈఎంఐలు కట్టడం చాలా సులభం అయిపోయింది. క్రెడిట్ కార్డు ఉంటే ప్రపంచాన్ని కొనేయొచ్చు అనే భ్రమలో యువత, మధ్యతరగతి జీవులు ఉన్నారు. కానీ, నెలాఖరు వచ్చేసరికి ఈఎంఐల భయంతో నిద్రలేని రాత్రులు గడిపేవాళ్ళు ఎంతోమంది. పైకి ఖరీదైన బట్టలు, కారు, ఇల్లు కనిపించవచ్చు. కానీ లోపల మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిన మానసిక క్షోభ దహించివేస్తుంటుంది. నకిలీ హోదా కోసం వెంపర్లాడటం కన్నా, అప్పుల్లేని ప్రశాంత జీవనం గడపడమే నిజమైన లగ్జరీ.

### భవిష్యత్ తరాలకు ఇచ్చే సందేశం ఏంటి?

తల్లిదండ్రుల జీవనశైలే పిల్లలకు తొలి పాఠశాల. అవసరానికి మించి అప్పులు చేసి, ఆర్భాటాలకు పోయే తల్లిదండ్రులను చూసి పెరిగే పిల్లలు కూడా అదే బాటలో పయనించే ప్రమాదం ఉంది. 'కష్టపడి సంపాదించడం, పొదుపు చేయడం, అవసరమైన మేరకు మాత్రమే ఖర్చు చేయడం' అనే క్రమశిక్షణను మనం వారికి నేర్పలేకపోతే, రేపటి తరం మరింత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటుంది. గతంలో మధ్యతరగతి ప్రజలు తమ దగ్గర డబ్బులు ఉంటే భూమి, బంగారం లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో దాచుకునేవారు. కాలక్రమేణా వాటి విలువ పెరిగి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేది. కానీ ఇప్పుడు లక్షల రూపాయలు వెచ్చించి కొంటున్న ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఇంటీరియర్స్, ఖరీదైన వాహనాలు అన్నీ 'డిప్రిసియేషన్' (విలువ పడిపోయే) వస్తువులే. కొన్న మరుసటి రోజు నుంచే వాటి విలువ సగానికి పడిపోతుంది. భవిష్యత్తును పణంగా పెట్టి, వర్తమానంలో తాత్కాలిక ఆనందాలను కొనుగోలు చేస్తున్నామన్న సత్యాన్ని గ్రహించాలి.



# 9వ తరగతి నుంచి త్రిభాషా విధానం

మొదటి పేజీ తరువాయి

జులై 2026 నుంచే ఇది అమల్లోకి వస్తుందని సీబీఎస్ఈ వెల్లడించింది. సీబీఎస్ఈ ఉత్తర్వుల ప్రకారం.. మూడు భాషల్లో రెండు భారతీయ భాషలై, ఏదో ఒక విదేశీ భాష ఉండాలి. ఈ మూడింటిని అధ్యయనం చేయాలి. అయితే, పది విద్యార్థులకు ఊరట కల్పించిన సీబీఎస్ఈ.. మూడో భాషకు బోర్డ్ ఎగ్జామ్ ఉండదని తెలిపింది. విద్యార్థులు భాషాధ్యయనంపైనే దృష్టి సారించేలా.. అనవసర ఒత్తిడి తగ్గించేందుకే ఈ వెసులుబాటు ఇచ్చినట్టు పేర్కొంది. ఆ పాఠశాలల్లో చూపే ప్రతిభ ఆధారంగానే ఈ సబ్జెక్ట్‌కు మార్కులు కేటాయిస్తారు. నూతన జాతీయ విద్యా విధానంలో త్రిభాషా విధానం ఒక భాగం. మూడు భాషలను విద్యార్థులు అభ్యసించాలని ఎన్పీఈ–2020 స్పష్టం చేసింది. వీటిలో రెండు తప్పనిసరిగా భారతీయ భాషలై ఉండాలని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలన్నింటికీ ఇది వర్తిస్తుంది. కానీ, ఈ భాషలను నిర్ణయించుకునే అధికారం మాత్రం రాష్ట్రాలకే అప్పగించింది. మాధ్యమిక స్థాయిలో భారతీయ భాషలు, ఇంగ్లీష్‌తో పాటు జపనీస్, కొరియన్, ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్‌లను అభ్యసించవచ్చని ఎన్పీఈ– 2020 చెబుతోంది. ఎక్కువ శాతం పాఠశాలల్లో ఇంగ్లీష్‌ను విదేశీ భాషగా పరిగణిస్తారు. కాబట్టి ఈ భాషను ఎంపిక చేసుకునే విద్యార్థులు రెండు భారతీయ భాషలను చదవాల్సి ఉంటుంది. రాజ్యాంగ మౌలిక నియమాలు, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం సహా బహుభాషా తత్వాన్ని ప్రోత్సహించి జాతీయ సమైక్యతను పెంపొందించడమే ఈ విధానామని ఎన్పీ నిబంధనలు చెప్తున్నాయి. అయితే, గతంలో తమిళనాడు ప్రభుత్వం ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. బలవంతంగా హిందీ రుద్దే ప్రయత్నం చేస్తున్నారని కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఎంకే స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ప్రభుత్వం ఆరోపించారు. ఈ వివాదం కారణంంగానే సర్వశిక్షాభియాన్ నిధులు తమిళనాడుకు నిలిచిపోవడం తీవ్ర దుమారం రేపింది. కానీ, అక్కడ కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో విజయ్ ఏం నిర్ణయం తీసుకుంటారోననేది ఆసక్తి రేపుతోంది. ఇక, మహారాష్ట్రలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు హిందీని విధిగా బోధించాలని మహారాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో మహాయుతి సర్కారు వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఆ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే.

# రేపు తిరుమల ఆగస్టు కోటా విడుదల

మొదటి పేజీ తరువాయి

ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నామని వివరించింది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ టికెట్లు పొందిన వారు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయని వివరించారు. 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, సాలకట్ల పవిత్రోత్సవాల టికెట్లను ఉదయం 10 గంటలకు ఆన్ లైన్ లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా వార్షిక పవిత్రోత్సవాల 23 నుంచి 25వ తేదీ వరకు టికెట్లను విడుదల చేస్తామన్నారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు , 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు , ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేస్తామని వెల్లడించారు. 25న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

# మూడో బిడ్డకు 30,000.. నాలుగో బిడ్డకు 40,000

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రకటన చేశారు. రెండో బిడ్డకు జన్మనిచ్చిన దంపతులకు రూ.25 వేలు ప్రోత్సాహకం అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు అప్పట్లో వెల్లడించారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల కారణంగా కుటుంబాల పరిమాణం తగ్గుతోందని చంద్రబాబు భావిస్తున్నారు. కొందరు దంపతులు ఒక్క బిడ్డతోనే సరిపెట్టుకుంటున్నారని, మరికొంతమంది తమ మొదటి బిడ్డ మగ బిడ్డ కాకపోతేనే రెండో బిడ్డను కనడానికి మొగ్గు చూపుతున్నారని ఆయన చెప్తున్నారు. ఇది జనాభా వృద్ధి రేటు క్షీణించడానికి కారణమవుతోందన్న చంద్రబాబు.. టోటల్ ఫర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) 2.1గా కొనసాగించాల్సిన అవసరం ఉందంటున్నారు. సగటు సంతానోత్పత్తి రేటు 2.1గా ఉన్నప్పుడే జనాభా స్థిరంగా ఉంటుందంటున్న చంద్రబాబు.. అనేక దేశాల్లో తగ్గుతున్న జనాభా, పెరుగుతున్న వృద్ధుల సంఖ్య ఆర్థిక వృద్ధిని దెబ్బతీశాయని హెచ్చరించారు. పిల్లలు ఒక భారం అనే భావన సరికాదని.. వారు ఒక ఆస్తి వంటివారని చెప్తున్నారు.

# 31 నాటికి తెలంగాణకు నైరుతి

మొదటి పేజీ తరువాయి

వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే.. మే 24న కేరళను తాకిన రుతుపవనాలు మే 31 నాటికి తెలంగాణను పలకరించాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 1 లేదా రెండో తేదీ నాటికే తెలంగాణవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ముందస్తు రుతుపవనాల రాకతో తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు, సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు పెద్ద ఊరట లభించినట్లయింది. అయితే, వర్షపాతం విషయంలో వాతావరణ శాఖ ఒక కీలక హెచ్చరికను కూడా జారీ చేసింది. ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే కొంచెం తక్కువగా వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ అభిప్రాయపడింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా ఈ వర్షాకాలంలో సగటున 80 సెంటీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉండగా.. 1971–2020 మధ్య కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్లుగా ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ముందస్తు రుతుపవనాల రాక సాగు పనులకు సానుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# వెండి దిగుమతులపై కఠిన ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విదేశీ మారకపు నిల్వలను పొదుపుగా వాడుకునేందుకు వీలుగా ఏడాది పాటు బంగారం కొనుగోలు ఆపేయాలని ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బంగారం, వెండి దిగుమతులపై కేంద్రం నియంత్రణ చర్యలు చేపట్టింది. వీటి దిగుమతి సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి పెంచింది. తాజాగా వెండి దిగుమతిపై ఆంక్షలు విధించడం గమనార్హం. అటు, బంగారం దిగుమతుల విషయంలో కూడా కొత్త ఆంక్షలు అమల్లోకి వచ్చినట్టు తెలుస్తోంది. అడ్వాన్స్ ఆథరైజేషన్ కింద ఒక్కో లైసెన్సు ద్వారా బంగారం 100 కిలోల వరకు మాత్రమే దిగుమతికి అనుమతి ఉంటుంది. అలాగే, కొత్తగా దరఖాస్తు చేసుకునే సంస్థలు తయారీ యూనిట్లను భౌతికంగా తనిఖీలు చేసిన తర్వాతే అనుమతులు మంజూరవుతాయి. అంతేకాదు, ఇప్పటికే ఎగుమతి లైసెన్సులు పొందినవారిపై కూడా కఠిన నిబంధనలు అమలు చేయనున్నారు. పాత లైసెన్సులతో కనీసం 50 శాతం ఎగుమతులు అయిన తర్వాతే కొత్త అనుమతులు జారీ చేయనున్నారు. అదనపు సుంకం లేకుండా బంగారం దిగుమతి చేసుకునే వ్యాపార సంస్థలు రెండు వారాలకు ఒకసారిరి చార్టర్డ్ అకౌంటెంట్ పరిశీలించిన దిగుమతి–ఎగుమతి వివరాలను అందజేయాల్సి ఉంటుంది. దిగుమతుల పరిమాణం తగ్గినప్పటికీ 2025–26లో భారత్ బంగారు దిగుమతులు 24 శాతానికి పైగా పెరిగి రికార్డు స్థాయిలో 71.98 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో కఠినమైన నిబంధనలు వచ్చాయి. భారత్ బంగారు దిగుమతులకు స్విట్జర్లాండ్ అతిపెద్ద కేంద్రం కాగా.. దాని తర్వాతి స్థానాల్లో యూఏఈ, దక్షిణాఫ్రికా ఉన్నాయి.

# భగీరథ్ సరెండర్

మొదటి పేజీ తరువాయి

ఇంటిలో సోదాలు నిర్వహించారు. భగీరథ్ విచారణకు హాజరు కాకుండా పరారీలో ఉండటంతో, ఆయన దేశం విడిచి వెళ్లకుండా ఉండేందుకు వీలుగా శనివారం సాయంత్రం లుకౌట్ నోటీసులు సైతం జారీ చేశారు. ఈ క్రమంలోనే ఉచ్చు బిగుస్తుండటం గమనించిన భగీరథ్.. న్యాయవాదుల సలహా మేరకు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలుస్తోంది.

### పోలీసులకు అప్పగించాం: బండి సంజయ్

'చట్టంపైన గౌరవంతోనే మా అబ్బాయిని పోలీసులకు అప్పగించా. ఏ తప్పు చేయలేదని మా అబ్బాయి చెబుతున్నాడు. ఆధారాలను చూపేందుకే పోలీసులకు అప్పగింతలో జాప్యం జరిగింది' అని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. తనకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని, అందుచేత ఏ తప్పూ చేయని తన కుమారుడు పోలీసులకు లొంగిపోయాడన్నారు బండి సంజయ్. చట్టం ముందు అంతా సమానమేనని, ప్రతీ ఒక్కరూ చట్టాన్ని గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే, బండి భగీరథ్‌ను అరెస్ట్ చేశామని సైబరాబాద్ సీపీ రమేష్‌రెడ్డి స్పష్టం చేశారు. భగీరథ్‌ను గాలింపు చేపట్టి.. నార్సింగిలోని పోలీస్ అకాడమీ వద్ద భగీరథ్‌ను అరెస్ట్ చేశామన్నారు.

### మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి వాంగ్మూలం

మరోవైపు, మేడ్చల్ కోర్టులో బాధితురాలు.. మేజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చింది. బాధితురాలి తల్లిదండ్రుల స్టేట్‌మెంట్ కూడా కోర్టు రికార్డ్ చేసింది. ఇప్పటికే రెండుసార్లు స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా స్వయంగా రంగంలోకి దిగిన న్యాయమూర్తి.. బాలిక స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. బాలిక తల్లిదండ్రుల నుంచి కూడా విడివిడిగా జడ్జి.. స్టేట్‌మెంట్ తీసుకున్నారు. బాధిత కుటుంబం నుంచి న్యాయస్థానం కీలక వివరాలు సేకరించింది. మూడోసారి స్టేట్‌మెంట్ ప్రక్రియ.. కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారింది. న్యాయమూర్తి సేకరించిన స్టేట్‌మెంట్ ఆధారంగా తదుపరి విచారణ మరింత వేగవంతం కానుంది.



## ఎన్నారైకి రూ.24 కోట్ల టోకరా

### బీజేపీ నేత గజ్జల యోగానంద్‌పై కేసు

హైదరాబాద్, మే 16 (ఈవార్తలు): వ్యాపారంలో పెట్టుబడుల పేరుతో ఓ ఎన్‌ఆర్ఐని రూ.24.53 కోట్లు మోసం చేశారన్న ఆరోపణలపై బీజేపీ నేత, ప్రముఖ వ్యాపారవేత్త గజ్జల యోగానంద్‌పై కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. పోలీసుల కథనం ప్రకారం, అమెరికాలో నివసించే పవన్ కుమార్ నల్లమల అనే ఎన్‌ఆర్ఐకి, మంజీరా హోటల్స్ అధినేత అయిన యోగానంద్‌తో 2014 నుంచి వ్యాపార పరిచయం ఉంది. 2019లో పవన్ కుమార్ భారత్‌కు వచ్చినప్పుడు, తన వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని యోగానంద్ నమ్మించారు. ఆయన మాటలు విశ్వసించిన పవన్ కుమార్, 2019 నుంచి 2024 మధ్య విడతల వారీగా మొత్తం రూ.24.53 కోట్లు పెట్టుబడిగా సమకూర్చారు. అయితే, డబ్బు తీసుకున్న యోగానంద్.. ఆ మొత్తానికి సంబంధించిన షేర్లను పవన్ కుమార్ పేరిట బదిలీ చేయలేదు. బాధితుడు పలుమార్లు అడిగినా స్పందన లేకపోవడంతో, 2024 నవంబర్‌లో విశ్వాసం కోసం ఇరువురి మధ్య ఒక అవగాహన ఒప్పందం కూడా జరిగింది. నిధులు అందినట్లు అంగీకరిస్తూ, త్వరలోనే షేర్ల బదిలీ పూర్తి చేస్తానని యోగానంద్ ఆ ఒప్పందంలో హామీ ఇచ్చారు. ఆ హామీతో పవన్ కుమార్ అమెరికా వెళ్లగా, వాట్సాప్ ద్వారా సంప్రదించినప్పుడు యోగానంద్ తప్పించుకు తిరిగారని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తయిందని తప్పుడు సమాచారం ఇచ్చారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2025 డిసెంబర్‌లో భారత్‌కు తిరిగొచ్చి ఆరా తీయగా, షేర్లు తన పేరు మీదకు బదిలీ కాలేదని తెలియడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## పోట్టేళ్ల పోట్లాటలో కాపరి బలి!

### ఖమ్మం జిల్లా ఉప్పలచెలకలో దారుణం

పెనుబల్లి, మే 16 (ఈవార్తలు): ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం ఉప్పలచెలక గ్రామంలో ఘోరం జరిగింది. రెండు పొట్టేళ్ళ మధ్య జరిగిన పొట్లాటను ఆపబోయిన గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉప్పలచెలక గ్రామానికి చెందిన కుటుంబరావు అదే గ్రామానికి చెందిన వీర్రాజు అనే రైతు వద్ద గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన కుటుంబరావు గొర్రెలను మేపడానికి గ్రామంలోని కొత్తచెరువు ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అక్కడ రెండు పొట్టేళ్ళు తీవ్రంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. దీంతో వాటిని ఆపడానికి కుటుంబరావు వెళ్ళాడు. అప్పటికే ఆవేశంగా కొట్టుకుంటున్న రెండు పొట్టేళ్ళు మధ్యలోకి వచ్చిన కుటుంబరావుపై దాడి చేశాయి. పొట్టేళ్ళ దాడిలో తీవ్రంగా గాయపడిన కుటుంబరావు స్పృహతప్పి పడిపోయాడు. సమీపంలోనే పశువులను కాస్తున్న ఓ మహిళ గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు 108కి సమాచారం ఇచ్చారు. అతనిని సమీపంలోని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ కుటుంబరావు ఈరోజు మృతి చెందాడు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# బండిని బర్తరఫ్ చేయండి

### కేంద్ర మంత్రిగా ఉంటే దర్యాప్తుపై ప్రభావం
### నిష్పక్షపాత విచారణకు చర్యలు తీసుకోవాలి
### ప్రధాని మోదీకి టీఆర్ఎస్ చీఫ్ కవిత లేఖ



హైదరాబాద్, మే 16 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడమే కవిత డిమాండ్‌కు ప్రధాన కారణం. "కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తు, తదుపరి విచారణ పూర్తి స్వాతంత్ర్యంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కవిత తన లేఖలో నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే, ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. "అందువల్ల ఈ కేసులో విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కవిత కోరారు. ఈ చర్య ద్వారా మైనర్ల భద్రతకు, న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందని ఆమె పేర్కొన్నారు. 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

#### ఉద్యమకారుల కమిటీలో మహిళలకు చోటేది?

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల వేదికగానే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, అలాగే అమరవీరుల కుటుంబాలకు సమరయోధుల పెన్షన్లు అందించే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం వేసిన ప్రత్యేక కమిటీలో ఒక్క మహిళకు కూడా చోటు కల్పించకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఉద్యమంలో క్రియాశీలంగా పోరాడిన సమస్త మహిళా లోకాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. కేవలం కమిటీలతో కాలయాపన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనని, ఒకవేళ జూన్ 2 లోపు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టకపోతే ఉద్యమకారుల సంఘాలతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని గౌరవించేందుకు సూచనలు చేసేలా రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే జీఓ నంబర్ - 679 ద్వారా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కె.కేశవరావు ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, శోభన్ రెడ్డి కమిటీ సభ్యులుగా ఉన్నారు.

## భూముల విలువ పెంచుతున్నాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, మే 16 (ఈవార్తలు): తెలంగాణలో భూముల మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ ధరల) పెంపుదలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్‌డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే శాస్త్రీయ పద్ధతిలో భూముల మార్కెట్ విలువను సవరించబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో భూముల విలువ భారీగా పెరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాలను ప్రామాణికంగా తీసుకుని ఈ ధరల పెంపు ఉంటుందని వివరించారు. ఈ శాస్త్రీయ సవరణల వల్ల కొన్ని ప్రాంతాలలో మార్కెట్ విలువ కనీసం రూ. 15 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. గత ప్రభుత్వం ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గతంలో రెండు సార్లు భూముల విలువను పెంచిందని మంత్రి గుర్తుచేశారు.

## కూటమి పాలనలో అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్

### ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం: వైఎస్ జగన్

తాడేపల్లి, మే 16 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. పాలనలో కేవలం అవినీతి, డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే కనిపిస్తున్నాయని విమర్శించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి రేటు 10.75 శాతంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారని, ఒకవేళ అదే నిజమైతే ప్రభుత్వ ఆదాయ వృద్ధి రేటు ఎందుకు 3.22 శాతానికి పడిపోయిందని జగన్ ప్రశ్నించారు. రాష్ట్రం నిజంగానే అభివృద్ధి చెందితే, దానికి అనుగుణంగా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ కూడా పెరగాలి కదా అని ఆయన నిలదీశారు. వైసీపీ పాలనలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెండేళ్లలో సాధారణంగా ఉండాల్సిన 8 శాతం వృద్ధి రేటును పరిగణనలోకి తీసుకున్నా, 2025-26 నాటికి ఈ పన్నుల ఆదాయం రూ. 1,00,219.69 కోట్లకు చేరాల్సి ఉందన్నారు. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో వాస్తవంగా వచ్చింది .

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines – Rs.450 (for each extra line – Rs.90)

COLOUR: Price for 5 Lines – Rs.500 (for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 Email: contact@evarthalu.com





# డాన్ కావాలని.. తల్లినే చంపి!

## స్నేహితుడితో కలిసి పథకం రచన.. విజయనగరం జిల్లాలో యువకుడి దారుణం

### తిరుపతిలో పట్టుకున్న పోలీసులు

విజయనగరం, మే 16 (ఈవార్తలు): అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకే ఆ తల్లి పాలిట యముడయ్యాడు. క్రమశిక్షణతో మెలగమని చెప్పిన మాటలే అతనికి నచ్చలేదు. కన్నతల్లి పెట్టిన ఆంక్షలను భరించలేక స్నేహితుడితో కలిసి కిరాతకంగా హతమార్చాడు. సభ్యసమాజాన్ని నివ్వెరపరిచే ఈ దారుణ ఘటన విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో చోటుచేసుకుంది. రాజాం మున్సిపాలిటీ పరిధిలోని డోలపేటకు చెందిన ముంజేటి స్పందన(34)కు 16 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల పదో తరగతి పూర్తి చేశాడు. కొడుకు చెడుదోవ పడతాడనే భయంతో స్పందన అతడిపై తరచూ ఆంక్షలు విధిస్తూ కఠినంగా వ్యవహరించేవారు. ఇదే సమయంలో తాను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నానని తల్లికి చెప్పగా, ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తల్లిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని ఆ బాలుడు నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడికి చెప్పి, ఇద్దరూ కలిసి హత్యకు పథకం రచించారు. మే 4న పథకం ప్రకారం తన స్నేహితుడిని ఇంటికి పిలిపించాడు. ఆ సమయంలో ఇంట్లో లేని తల్లికి ఫోన్ చేసి రప్పించాడు. తల్లి ఇంటికి రాగానే బాత్రూమ్‌కు వెళ్తుందని ఊహించి, అక్కడే స్నేహితుడిని మాటు వేయమని సూచించాడు. స్పందన బాత్రూమ్‌లోకి వెళ్లగానే ఆమె స్నేహితుడు గట్టిగా పట్టుకోగా, ఇద్దరూ కలిసి రెండు చాకులతో ఆమె శరీరంపై సుమారు 15 సార్లు విచక్షణారహితంగా పొడిచి దారుణంగా హత్య చేశారు. అనంతరం బాత్రూమ్‌లోని రక్తపు మరకలను శుభ్రం చేసి, మృతదేహాన్ని ఇంటి వెనుక ఉన్న చెరువు వద్ద ముళ్లపొదల్లో పడేశారు. ఇంట్లోని 9.5 తులాల బంగారం, రూ. 5 వేల నగదు, తల్లి మొబైల్ ఫోన్‌తో పరారయ్యారు. ముంబై వెళ్లి మాఫియాలో చేరాలనే లక్ష్యంతో ముందుగా పలాస చేరుకుని, అక్కడి నుంచి ముంబై వెళ్లారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, స్పందన శరీరంపై కత్తిపోట్లు ఉండటంతో హత్యగా నిర్ధారించారు. కొడుకు అదృశ్యం కావడంతో అతనిపై అనుమానంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులతో మాట్లాడటాన్ని సాంకేతిక ఆధారాలతో పోలీసులు గుర్తించారు. వారు ముంబైలో ఉన్నట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు. అయితే, అక్కడి నుంచి తప్పించుకుని వారు తిరుపతి చేరుకున్నారు. వారి కదలికలను నిరంతరం గమనిస్తున్న రాజాం పోలీసులు, తిరుపతి పోలీసుల సహకారంతో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, శ్రీకాకుళంలోని జువైనల్ బోర్డు ఎదుట హాజరుపరిచినట్లు డీఎస్పీ రాఘవులు మీడియాకు వెల్లడించారు.




# లండన్‌లో భారతీయ ఇమామ్ పైశాచికం

### అతీంద్రియ శక్తుల పేరుతో అత్యాచారాలు



లండన్: తనకు అతీంద్రియ శక్తులున్నాయని నమ్మించి 12 ఏళ్ల బాలికలు సహా పలువురు మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన భారత సంతతి ఇమామ్‌కు యూకే కోర్టు జీవిత ఖైదు విధించింది. తూర్పు లండన్‌కు చెందిన 54 ఏళ్ల అబ్దుల్ హలీమ్ ఖాన్ కనీసం 20 సంవత్సరాలు జైలులో గడపాలని స్నారెస్‌బ్రూక్ క్రౌన్ కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఓల్డ్ ఫోర్డ్ రోడ్‌లో ఇమామ్‌గా పనిచేస్తున్న అబ్దుల్ హలీమ్ ఖాన్ తన మతపరమైన హోదాను అడ్డం పెట్టుకుని తొమ్మిదేళ్ల పాటు ఘోరాలకు పాల్పడ్డాడు. 2005 నుంచి 2014 మధ్య కాలంలో ఏడుగురు మహిళలు, బాలికలను లైంగికంగా హింసించాడు. బాధితులతో ఏకాంతంగా మాట్లాడాలని చెప్పి వారిని ఫ్లాట్లు, రహస్య ప్రదేశాలకు పిలిపించేవాడు. అక్కడ వారిపై లైంగిక దాడికి పాల్పడుతూ తనను ఒక అతీత శక్తి (జిన్) ఆవహించిందని నమ్మించే ప్రయత్నం చేసేవాడని 'స్కై న్యూస్' తన కథనంలో పేర్కొంది. కొంతమంది బాధితులలోని దుష్ట శక్తులను తరిమికొడతానని, మరికొందరికి ఉన్న అనారోగ్యాలను నయం చేస్తానని మాయమాటలు చెప్పేవాడు. అండాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ యువతికి తానే నయం చేస్తానని చెప్పి కారులో ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని 'బీబీసీ' నివేదించింది. ఈ కేసులో ఫిబ్రవరిలోనే దోషిగా తేలిన ఖాన్‌పై మొత్తం 21 అభియోగాలు నమోదయ్యాయి. తీర్పు సందర్భంగా న్యాయమూర్తి లెస్లీ కత్‌బర్ట్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "పవిత్రత, భక్తి అనే ముసుగులో ఖాన్, తనను నమ్మిన మహిళలను తన లైంగిక వాంఛ తీర్చుకోవడానికి దారుణంగా వాడుకున్నాడు. ఇది ముస్లిం విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించడమే" అని అన్నారు. ముఖ్యంగా బంగ్లాదేశీ ముస్లిం కమ్యూనిటీకి చెందిన మహిళలు, బాలికలనే లక్ష్యంగా చేసుకుని ఖాన్ ఈ అఘాయిత్యాలకు పాల్పడ్డాడని జడ్జి పేర్కొన్నారు. తనపై ఎవరూ ఫిర్యాదు చేయరనే ధైర్యంతో, ఎదురు తిరిగినా తననే నమ్ముతారనే గర్వంతో అతను వ్యవహరించాడని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. బాధితులలో ఒకరు కోర్టులో మాట్లాడుతూ "నా దృష్టిలో అతడు మనిషి కాదు, రూపం దాల్చిన దుర్మార్గుడు" అని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి గురించి బయటకు చెబితే, చేతబడి చేసి కుటుంబానికి హాని తలపెడతానని ఖాన్ బెదిరించినట్లు మరో బాధితురాలు తెలిపింది.

## భారతీయుడికి దుబాయ్‌లో పదేళ్ల జైలు

దుబాయ్: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన ఓ భారతీయ యువకుడికి స్థానిక కోర్టు పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. విమానంలో తన మొబైల్ ఫోన్‌లో ఫోటోలు, వీడియోలు తీసుకున్నందుకు ఈ శిక్ష పడింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, బిహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాకు చెందిన వసీం అక్రమ్ అనే యువకుడు కూలీగా పనిచేసేందుకు దుబాయ్ వెళ్లాడు. సుమారు రెండు నెలల క్రితం, శుక్రవారం ప్రార్థనల అనంతరం పోలీసులు అతడిని మరికొందరితో పాటు అదుపులోకి తీసుకున్నారు. విచారణ తర్వాత ఇతరులను విడిచిపెట్టి, వసీంను మాత్రం జైలుకు పంపారు. అతని ఫోన్‌లో విమానానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఉండటమే ఇందుకు కారణమని తేలింది. ఈ కేసును విచారించిన దుబాయ్ కోర్టు, మే 14న వసీం అక్రమ్‌ను దోషిగా నిర్ధారించి పదేళ్ల జైలు శిక్ష విధించింది. దుబాయ్ చట్టాల విమానాల్లో, విమానాశ్రయాల్లో ఫోటోలు తీయడం తీవ్రమైన భద్రతా ఉల్లంఘన కిందకు వస్తుంది. తన కుమారుడికి అక్కడి కఠినమైన నిబంధనల గురించి తెలియదని, సరదాగా జ్ఞాపకం కోసం ఫోటోలు తీసుకుని ఉండవచ్చని వసీం తల్లి షైదా ఖాతూన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆయిల్ కంపెనీలకు భారీ ఊరట

**రూ. 52,700 కోట్ల మేర ఉపశమనం**

**పెట్రో చార్జీల పెంపుపై విశ్లేషకులు**

**ద్రవ్యోల్బణంపై ప్రభావం ఉంటుందన్న ఎస్‌బీఐ రిసెర్చ్**

న్యూఢిల్లీ: ఇటీవల పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలను లీటర్‌కు రూ. 3 చొప్పున పెంచడం వల్ల తీవ్ర నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీ) భారీ ఊరట లభించనుంది. ఈ పెంపుతో కంపెనీలకు సుమారు రూ. 52,700 కోట్ల వరకు ఉపశమనం కలుగుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. శనివారం విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం 2027 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ కంపెనీలు ఎదుర్కోనున్న మొత్తం నష్టాల్లో ఈ ఉపశమనం దాదాపు 15 శాతానికి సమానం. అంతర్జాతీయంగా బ్రెంట్ ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశంలో రిటైల్ ధరలను స్థిరంగా ఉంచడంతో ఆయిల్ కంపెనీలు రోజుకు రూ. 1,000 కోట్లు, ఏడాదికి సుమారు రూ. 3.6 లక్షల కోట్ల నష్టాలను చవిచూస్తున్నాయని ప్రభుత్వ అంచనా. తాజా పెంపుతో ఈ నష్ట భారాన్ని కొంతమేర తగ్గించుకునేందుకు అవకాశం లభించింది. ఈ ధరల పెంపు వల్ల ఇంధన వినియోగంపై దీర్ఘకాలిక ప్రభావం ఉండదని ఎస్‌బీఐ రీసెర్చ్ స్పష్టం చేసింది. ధరలు పెరిగిన వెంటనే వినియోగం తగ్గినా, ఏడాదిలోపే తిరిగి పుంజుకుంటుందని గత గణాంకాలు సూచిస్తున్నాయని వివరించింది. అయితే, మే-జూన్ 2026 నెలల్లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ద్రవ్యోల్బణంపై 15-20 బేసిస్ పాయింట్ల తక్షణ ప్రభావం ఉండొచ్చని, దీంతో ఎఫ్‌వై27 ద్రవ్యోల్బణం అంచనాను 4.7 శాతానికి సవరిస్తున్నట్లు పేర్కొంది. అయితే, రూపాయి విలువ క్షీణించడం ఈ ప్రయోజనాలకు గండికొట్టే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మరో రూ. 2 పతనమైతే, ధరల పెంపు ద్వారా వచ్చే లాభం పూర్తిగా హరించుకుపోతుందని స్పష్టం చేసింది. రూపాయి విలువ ఇప్పటికే ప్రమాదకర స్థాయికి చేరుకున్నందున, మరింత బలహీనపడితే ఇంధన ధరల పెంపు లక్ష్యం నెరవేరదని విశ్లేషించింది.


# రాబర్ట్ వాద్రాకు బెయిల్



న్యూఢిల్లీ: హర్యానాలోని గురుగ్రామ్ భూ కుంభకోణం, మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పెద్ద ఉపశమనం లభించింది. ఈరోజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరైన ఆయనకు ప్రత్యేక న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... ఇది 3.53 ఎకరాల ల్యాండ్ డీల్ కేసు. 2008లో హర్యానాలోని శిఖోపూర్ గ్రామంలో జరిగిన భూ లావాదేవీల చుట్టూ ఈ కేసు నడుస్తోంది. రాబర్ట్ వాద్రాకు చెందిన 'స్కై లైట్ హాస్పిటాలిటీ' సంస్థ, ఒంకార్వేగర్ ప్రాపర్టీస్ నుండి ఈ భూమిని కొనుగోలు చేసింది. ఈ డీల్ సమయంలో తప్పుడు పత్రాలు సమర్పించారని, ఎలాంటి నగదు చెల్లించకుండా (నగదుగా మారని చెక్కు ద్వారా) లావాదేవీలు జరిపారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపించింది. అప్పటి రాజకీయ ప్రభావాన్ని ఉపయోగించి ఈ భూమికి కమర్షియల్ లైసెన్స్ సంపాదించి, ఆ తర్వాత దానిని 'డీఎల్‌ఎఫ్' సంస్థకు భారీ లాభానికి విక్రయించారని ఈడీ పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారం ద్వారా పిఎంఎల్‌ఏ చట్టం ప్రకారం రూ. 58 కోట్ల మేర అక్రమ సొమ్ము ఆర్జించారని ఈడీ చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసింది. ఈ కేసు చార్జ్‌షీట్‌ను పరిశీలించిన ప్రత్యేక కోర్టు రాబర్ట్ వాద్రాకు సమన్లు జారీ చేస్తూ మే 16న హాజరు కావాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం శనివారం హాజరైన వాద్రాకు రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు, అంతే మొత్తానికి సమానమైన ఒక షూరిటీ సమర్పించాలనే షరతుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల

ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఐసెట్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ పరీక్షకు మొత్తం 23,198 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇందులో 21,205 మంది ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. ఉత్తీర్ణత శాతం 91.41 అని తెలిపారు.




# ఎవరినో సీఎం చేయాలని పవన్ పార్టీ: అంబటి

గుంటూరు, మే 16 (ఈవార్తలు): జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేత అంబటి రాంబాబు ఘాటు విమర్శలు చేశారు. పవన్ తన పార్టీని సీఎం అవ్వడానికి పెట్టలేదని, మరొకరిని సీఎం చేయడానికి పెట్టారని తమకు ఎప్పటినుంచో తెలుసంటూ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా అంబటి ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళ నటుడు విజయ్ ఇటీవల రాజకీయాల్లోకి వచ్చి ఒంటరిగా పోటీ చేసి గెలిచిన నేపథ్యంలో, పవన్ కూడా అలాగే గెలవాల్సిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై జనసేనాని స్పందించారు. విజయ్‌తో తనకు పోలిక లేదని, గతంలో తాను ఒంటరిగా రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. అందుకే పొత్తులతో వెళ్లాల్సి వచ్చిందని ఆయన వివరించారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలనే అంబటి రాంబాబు ఆయుధంగా చేసుకున్నారు. "మీరు సీఎం కావాలని కాదు, ఎవరో సీఎం కావాలని పార్టీ పెట్టారని మాకు ఎప్పుడో తెలుసు. కానీ ఆ విషయం ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది" అని అంబటి వ్యాఖ్యానించారు. పవన్ స్వయంగా తన ఓటమిని, పొత్తుల అవసరాన్ని అంగీకరించడంతో, ఆయన రాజకీయ లక్ష్యంపై అంబటి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలతో ఏపీ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం మొదలైంది.

# స్టాక్ మార్కెట్లలో భారీ పతనం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారం కూడా భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరల కారణంగా ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో సూచీలు కుప్పకూలాయి. ఈ వారంలో సెన్సెక్స్, నిఫ్టీలు 2 శాతానికి పైగా నష్టపోయాయి. శుక్రవారంతో ముగిసిన వారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 2.7 శాతం (2,000 పాయింట్లకు పైగా) క్షీణించి 75,238 వద్ద స్థిరపడింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 2.2 శాతం (532 పాయింట్లు) నష్టపోయి 23,643.5 వద్ద ముగిసింది. బ్రాడర్ మార్కెట్లపై ఒత్తిడి మరింత ఎక్కువగా కనిపించింది. మిడ్-క్యాప్ సూచీ 2 శాతానికి పైగా పడిపోగా, స్మాల్-క్యాప్ సూచీ ఏకంగా 4 శాతం నష్టపోయింది. రంగాలవారీగా చూస్తే, రియల్టీ రంగం అత్యంత దారుణంగా దెబ్బతింది. బీఎస్‌ఈ రియల్టీ ఇండెక్స్ ఏకంగా 8 శాతం కుప్పకూలింది. ఐటీ రంగ షేర్లు కూడా 5.7 శాతం పతనమయ్యాయి. వీటితో పాటు ఆటో, క్యాపిటల్ గూడ్స్, బ్యాంకింగ్, పీఎస్‌యూ షేర్లు సైతం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయితే, ఈ ప్రతికూల పరిస్థితుల్లోనూ మెటల్, హెల్త్‌కేర్ వంటి కొన్ని రంగాలు స్వల్పంగా లాభపడ్డాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 105-110 డాలర్ల స్థాయిలో ఉండటం, డాలర్ బలపడటం వంటి కారణాలతో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) అమ్మకాలకు మొగ్గుచూపుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నప్పటికీ, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ), రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి మార్కెట్లకు మద్దతు లభిస్తోంది. ముఖ్యంగా ఏప్రిల్‌లో సిప్ ద్వారా రికార్డు స్థాయిలో రూ. 31,115 కోట్ల పెట్టుబడులు రావడం మార్కెట్లకు కొంత ఊరటనిచ్చింది.

# ఐసిస్ అగ్ర కమాండర్ హతం

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద సంస్థ 'ఇస్లామిక్ స్టేట్'కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ సంస్థ గ్లోబల్ డిప్యూటీ చీఫ్, ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్-మినుకిని సైనిక దాడుల్లో మట్టుబెట్టినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ అత్యంత రహస్యమైన, సంక్లిష్టమైన మిషన్‌ను అమెరికా సైన్యం, నైజీరియా సాయుధ దళాలు సంయుక్తంగా పూర్తి చేశాయని ట్రంప్ వెల్లడించారు. తన ఆదేశాల మేరకే ఈ ప్రత్యేక ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు. ఐసిస్‌లో రెండో అత్యున్నత స్థానంలో ఉన్న అబూ బిలాల్ ఆఫ్రికాలో తలదాచుకుంటే ఎవరూ గుర్తించలేరని భావించాడని అన్నారు. అయితే అతడు ఎక్కడ ఉన్నాడు? ఏం చేస్తున్నాడు? అనే విషయాలపై తమ నిఘాల వర్గాల ద్వారా నిరంతరం సమాచారం సేకరిస్తూనే ఉన్నామని ట్రంప్ స్పష్టం చేశారు. సరైన సమయం చూసి అంతమొందించినట్లు చెప్పారు. అబూ బిలాల్ హతంతో ఐసిస్ నెట్‌వర్క్ పూర్తిగా బలహీనపడే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## సతీశన్ ప్రమాణ స్వీకారానికి శశిథరూర్ డుమ్మా

తిరువనంతపురం, మే 16 (ఈవార్తలు): కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ మరోసారి పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. కేరళ నూతన ముఖ్యమంత్రిగా నియమితులైన వీడీ సతీశన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తాను హాజరు కావడం లేదని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ నాయకత్వంలోని కొన్ని వర్గాలతో థరూర్‌కు విభేదాలు ఉన్నాయనే వార్తల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వారాంతంలో తాను అమెరికాలోని బోస్టన్‌లో పర్యటిస్తున్నానని, అందుకే ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నానని థరూర్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. తాను చదువుకున్న టఫ్ట్స్ యూనివర్సిటీలోని ఫ్లెచర్ స్కూల్ ఆఫ్ లా అండ్ డిప్లమసీ స్నాతకోత్సవంలో ప్రసంగించాల్సి ఉందని, అలాగే తన గ్రాడ్యుయేటింగ్ క్లాస్ 50వ వార్షికోత్సవ రీయూనియన్‌లో పాల్గొంటున్నానని వివరించారు. "అమెరికాలో గతాన్ని గుర్తుచేసుకుంటూనే, కేరళ భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నా" అని ఆయన పేర్కొన్నారు. అయితే, గతంలోనూ థరూర్ పలు కీలక పార్టీ సమావేశాలకు గైర్హాజరయ్యారు. ఈ ఏడాది జనవరిలో కేరళ అసెంబ్లీ ఎన్నికల సన్నాహకాలపై చర్చించేందుకు ఢిల్లీలో హైకమాండ్ ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన వెళ్లలేదు. దీంతో పార్టీలోని అంతర్గత విభేదాల కారణంగానే ఆయన దూరంగా ఉంటున్నారనే ఊహాగానాలు బలపడుతున్నాయి. మరోవైపు, ముఖ్యమంత్రిగా ఎంపికైనందుకు వీడీ సతీశన్‌కు థరూర్ అభినందనలు తెలిపారు. సతీశన్ పట్టుదల, అంకితభావానికి ఇది తగిన గుర్తింపు అని ప్రశంసించారు. యూడీఎఫ్ విజయం ఒక వ్యక్తిది కాదని, ఇది 'టీమ్ యూడీఎఫ్' విజయమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో 140 స్థానాలకు గానూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 102 సీట్లు గెలుచుకుని ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

# పరీక్ష పేపర్ ఇస్తా.. కోరిక తీర్చు

**ప్రొఫెసర్ లైంగిక వేధింపులు.. లక్నో వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరెస్ట్**

**ఘటనపై 24 గంటల్లో నివేదిక : వీసీ ఆదేశాలు**

లక్నో: లక్నో యూనివర్సిటీలో పనిచేస్తున్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ చేస్తానని ఆశచూపి, ఒక విద్యార్థిని నుంచి లైంగిక ప్రయోజనాలు కోరినట్లు ఆయనపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించిన ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యూనివర్సిటీలో కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే, యూనివర్సిటీలోని జువాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పరంజీత్ సింగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థినితో ఫోన్‌లో అసభ్యంగా మాట్లాడినట్లు ఆరోపణలున్నాయి. "డార్లింగ్, నీ కోసం పరీక్ష పేపర్ ఏర్పాటు చేశాను. పరీక్షకు ముందే నా దగ్గరికి రా, ఇక్కడే నీకు ఇస్తాను" అని ఆయన చెప్పినట్లుగా ఆడియోలో రికార్డ్ అయింది. ఈ సంభాషణతో తీవ్ర మానసిక వేదనకు గురైన విద్యార్థిని, విషయాన్ని యూనివర్సిటీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో, యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి విద్యానంద్ త్రిపాఠి పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. హసన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు, ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలన్నింటినీ ప్రొఫెసర్ పరంజీత్ సింగ్ ఖండించారు. యూనివర్సిటీలోని 'అంతర్గత రాజకీయాల' కారణంగా తనను ఉద్దేశపూర్వకంగా ఇరికిస్తున్నారని ఆయన ఆరోపించారు.



# ఘనంగా నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం

హైదరాబాద్, మే 16 (ఈవార్తలు): అమావాస్య, శని జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్, కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్క్ సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 9:00 గంటలకు శని దేవుని ఆశీస్సులు కోరుతూ పలువురు భక్తులు పాల్గొనడంతో శని హోమం ప్రారంభమైంది. అనంతరం, బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణరావు మధ్యాహ్నం 12:30 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికుల నుండి అద్భుతమైన స్పందన లభించింది. కార్యక్రమాన్ని జయప్రదం చేసిన భక్తులు, వాలంటీర్లు, మద్దతుదారులందరికీ ఎన్.ఆర్. లక్ష్మణరావు ధన్యవాదాలు తెలియజేశారు.



# 20న మెడికల్ షాపుల బంద్ కు మద్దతు ఇవ్వండి

**కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన కెమిస్ట్స్**

హైదరాబాద్, మే 16 (ఈవార్తలు): ప్రజల ఆరోగ్యం, ఫార్మసీ వ్యాపార ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీన మెడికల్ షాపుల బంద్ కు మద్దతు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కే.తారకరామారావును శనివారం తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. కెమిస్టుల సమస్యలను అసెంబ్లీలో చర్చించి పరిష్కరించే విధంగా చూడాలని వారు కేటీఆర్, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ గీసూలాల్ జైన్, సంజయ్ కుమార్ మోడీ, ఆనంద్ కుమార్ గౌడ్, మందా సూర్యప్రకాష్, వికాస్ అగర్వాల్, సతీష్ కుమార్, సుధీర్ గుప్తా, ఎం.సత్యనారాయణ, కొత్తపల్లి శ్రీనివాస్, తొడుపునూరి రాజు, పెండం కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**మహిళా సంఘాలకు వీవో భవనాలు నిర్మిస్తాం**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

పెగడపల్లి, మే 16 (ఈవార్తలు): మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లో మహిళా సంఘాల వీఓ భవనాలకు శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందేందుకు "మహిళా శక్తి" పథకం కింద రుణాలు అందజేస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. సుద్దపల్లి గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో, దోమలకుంట గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో వీఓ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి వెల్లడించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మహిళా సంఘాలకు వీఓ భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.



# ఫజల్ బేగ్‌కు ఉత్తమ జర్నలిస్టు అవార్డు

జగిత్యాల, మే 16 (ఈవార్తలు): సీఈటీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డు 2025 కార్యక్రమంలో శనివారం జగిత్యాలకు చెందిన పాత్రికేయుడు మీర్జా ఫజల్ బేగ్ ఉత్తమ జర్నలిస్టు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు,, మహమ్మద్ ఇమ్రాన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, జర్నలిస్టులు రంగారావు, ముజాహిద్ ఆదిల్, ఇమ్రాన్ జైన్, బండ స్వామి, జహీర్, మోసిఖ్, హైదర్, నజీమ్, సులేమాన్లు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రభుత్వ భూములు రక్షించి కేవీ ఏర్పాటు చేయాలి

**అదనపు కలెక్టర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం**



జగిత్యాల, మే 16 (ఈవార్తలు): నర్సింగాపూర్ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడి అక్కడ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 437, 251లోని ప్రభుత్వ భూములను కొంతమంది అక్రమంగా ఆక్రమించుకొని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇటుక బట్టీల నిర్వహణకు నాలా కన్వర్షన్‌తో పాటు ఇతర ప్రభుత్వ అనుమతులు అవసరమైనప్పటికీ, ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపిస్తూ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు దీనిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సర్వే నంబర్ 437లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అక్కడ కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రభుత్వ భూములు రక్షించబడటమే కాకుండా జిల్లాలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ఎం. సంజయ్ కుమార్ సహకారంతో కేంద్రీయ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని కోరారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు వృథా అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎస్ రాజు, సిపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, అరవ లక్ష్మి, అంకర్ సుధాకర్, నరెందుల శ్రీనివాస్, బశెట్టి ప్రభాకర్, లింగాల శ్రీకాంత్ రావు, ఠాకూర్ కిషోర్ సింగ్, ఎడమల వెంకట్ రెడ్డి, పోరండ్ల భిక్షపతి, ఇత్తడి రాజిరెడ్డి, నవ్వోతు సురేశ్, నాయిని సంజీవరావు, ఎర్ర శ్రీనివాస్, గోడిశేల నాగరాజు, బుర్ర ప్రమోద్, బిట్టు, సరేల మహేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**జాప్యం వల్ల రైతులకు నష్టం: దావ వసంత**



జగిత్యాల, మే 16 (ఈవార్తలు): రైతులు ఇబ్బందులు పడకుండా వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్ అధికారులను కోరారు. శనివారం చల్గల్ గ్రామంలోని మార్కెట్ యార్డులో పోసిన వడ్ల కుప్పలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వడ్లు పోసి నెలరోజులు గడుస్తున్నప్పటికీ కొనుగోళ్లు పూర్తికాకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గన్నీ బ్యాగులు, లారీల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు ప్రణాళికాబద్ధంగా కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని కోరారు. అకాల వర్షాలు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేశారని, ప్రస్తుతం కూడా అదే విధంగా రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించాలని అన్నారు. కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# విద్యాసంస్థలకు స్థల కేటాయింపుపై జీవో జారీ

**ప్రభుత్వానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కృతజ్ఞతలు**

జగిత్యాల, మే 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయాలకు స్థల కేటాయింపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శనివారం హైదరాబాద్‌లో మంత్రులు దుద్దిల్లా శ్రీధర్ బాబు , ఉత్తమ్ కుమార్ రెడ్డి లను కలిసి జగిత్యాలకు మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయాలకు స్థల కేటాయింపు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం చల్గల్ గ్రామంలోని వాలంతరీకి చెందిన 10 ఎకరాల భూమిని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు, మరో 2 ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయానికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు 10 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయానికి 2 ఎకరాల స్థలం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఏ . రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి అడలూరి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# భోగ శ్రావణికి స్వల్ప గాయాలు

**జగిత్యాలలో బీజేపీ ఆందోళన .. కేవీ కోసం పోరాటం.. ఉద్రిక్తత**

జగిత్యాల, మే 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో శనివారం రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నెల 18న నిర్వహించనున్న ఎంపీ ధర్మపురి అరవింద్ ధర్మదీక్షకు పోలీసులు అనుమతులు నిరాకరించడంతో బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ భోగ శ్రావణి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. జగిత్యాల విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయం అవసరమంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రభుత్వం కావాలనే కేంద్రీయ విద్యాలయ ఏర్పాటును అడ్డుకుంటోందని ఆరోపించారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు భారీగా మోహరించి నిరసనకారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో డాక్టర్ భోగ శ్రావణితో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో డాక్టర్ భోగ శ్రావణికి స్వల్ప గాయాలయ్యాయి. తమ నాయకురాలిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ భోగ శ్రావణితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను పోలీస్ స్టేషన్కు తరలించారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భోగ శ్రావణి మాట్లాడుతూ జగిత్యాల యువతకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో తాము పోరాటం చేస్తున్నామని, ధర్మదీక్షకు అనుమతి ఇవ్వకుండా ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని, పోలీసులు బలప్రయోగంతో ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్నారని, అయినా తమ పోరాటం ఆగదన్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మెట్‌పల్లి, మే 16 (ఈవార్తలు): మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మెట్‌పల్లి పట్టణం, మెట్‌పల్లి మండలం, ఇబ్రహీంపట్నం మండలం, మల్లాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.6,36,000 విలువైన 41 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరా అవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటు.. కోరుట్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కోరుట్ల పట్టణం, మండలానికి చెందిన లబ్ధిదారులకు మొత్తం రూ.5,32,000 విలువైన 38 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# ఎన్పీడీసీఎల్‌లో 'వన్ మినిట్ రూల్' అమలు

**ఎస్ఈ బొంకూరి సుదర్శనం వెల్లడి**

జగిత్యాల, మే 16 (ఈవార్తలు): విద్యుత్ శాఖ సిబ్బంది భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ టీజీఎన్పీడీసీఎల్ జగిత్యాల సర్కిల్ పరిధిలో "వన్ మినిట్ రూల్" పేరుతో ప్రత్యేక భద్రతా విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ ఇంజనీర్ బొంకురి సుదర్శనం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి కేవలం ఒక నిమిషం సమయం తీసుకుని భద్రతా ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించడం ఈ విధానంలోని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాలను గణనీయంగా తగ్గించడం, సిబ్బంది ప్రాణాలను రక్షించడం, విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సురక్షితంగా నిర్వహించడం లక్ష్యంగా ఈ కొత్త విధానాన్ని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున, "ఈ ఒక్క నిమిషం జాగ్రత్త సిబ్బంది ప్రాణాలను కాపాడగలదు" అని ఆయన స్పష్టం చేశారు. వన్ మినిట్ రూల్‌లో భాగంగా లైన్ క్లియర్ నిర్ధారణ, ఇండక్షన్ టెస్టర్‌తో విద్యుత్ సరఫరా లేదని పరీక్షించడం, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ఎర్తింగ్ వ్యవస్థ తనిఖీ, డబుల్ ఫీడింగ్ నివారణ, పరికరాల భద్రతా పరిశీలన వంటి చర్యలు తప్పనిసరిగా అమలు చేస్తున్నామని తెలిపారు. టీజీఎన్పీడీసీఎల్‌లో ప్రతి ఉద్యోగి ఈ నిబంధనను కచ్చితంగా పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు, భద్రతా శిక్షణలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భద్రతా నియమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తే విద్యుత్ ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. "ఒక్క నిమిషం ఆలోచన -- జీవితాంతం భద్రత" అనే సందేశంతో వన్ మినిట్ రూల్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఎస్ఈ బొంకూరి సుదర్శనం తెలిపారు.



# జగిత్యాల ఎస్పీపై అర్వింద్ ఫైర్

**నిరాహార దీక్షకు అనుమతి నిరాకరణపై ఆగ్రహం**

**మహిళను గాయాలయ్యేలా ఈడ్చుకెళ్లారని ఫైర్**

జగిత్యాల, మే 16 (ఈవార్తలు): ఈ నెల 18న చల్గల్ శివారులో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి భూమి కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా జగిత్యాల పట్టణంలోని తహసీల్ చౌరస్తా వద్ద నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు బీజేపీ నాయకులు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలో నిరాహార దీక్ష నిర్వహించేందుకు భారతీయ జనతా పార్టీ నాయకులు పోలీసులను అనుమతి కోరగా, అధికారులు అనుమతి నిరాకరించారు. దీనికి నిరసనగా బీజేపీ నాయకురాలు బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద భారీ రాస్తారోకో నిర్వహించారు. నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించగా, పోలీసులు ధర్నాను అడ్డుకున్నారు. మహిళలు అనే విషయాన్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా, గాయాలయ్యేలా ఈడ్చుకుంటూ పోలీస్ వాహనాల్లో స్టేషన్‌కు తరలించగా, విషయం తెలుసుకున్న ఎంపీ ధర్మపురి అర్వింద్ వెంటనే జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌కు ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బీఆర్ఎస్‌కు , అలాగే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో కాంగ్రెస్‌కు కూడా అదే తహసీల్ చౌరస్తాలో నిరసనలకు అనుమతులు ఇచ్చారని, అయితే బీజేపీకి మాత్రమే ఎందుకు అనుమతి నిరాకరిస్తున్నారని ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

లయ్యారి చిత్రం





## ధనుష్‌కు చేతులెత్తి మొక్కుతా

తమిళ స్టార్ హీరో ధనుష్ గురించి టాలీవుడ్ ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కమర్షియల్ హీరోగా భారీ స్థాయిలో మార్కెట్ ఉన్నప్పటికీ, ధనుష్ చిన్న సినిమాలకు, కొత్త టాలెంట్‌కు ఇస్తున్న ప్రోత్సాహాన్ని ప్రశంసిస్తూ భరణి చేసిన కామెంట్స్ సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ధనుష్‌కు చేతులెత్తి నమస్కారం చేయాలంటూ ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల్లో కూడా కొత్త చర్చకు దారి తీశాయి. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ధనుష్ ఒక కమర్షియల్ హీరో అయి ఉండి కూడా గత ఐదేళ్లుగా రెండు కోట్ల బడ్జెట్‌తో కొత్తవాళ్లతో సినిమాలు తీస్తున్నాడని, ప్రతి సినిమా పది కోట్ల వరకు రాబడుతోందని, నేషనల్ అవార్డులు కూడా వస్తున్నాయని, ఇది ఎంతో అందమైన కాన్సెప్ట్ అని, తెలుగు ఇండస్ట్రీలో ఎందుకు ఇలాంటి ప్రయత్నాలు ఎక్కువగా కనిపించట్లేదో తనకి అర్థం కావడం లేదని భరణి వ్యాఖ్యానించారు. తనికెళ్ల భరణి వ్యాఖ్యలు టాలీవుడ్‌పై ఓ పరోక్ష ప్రశ్నగా మారాయి. తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద హీరోలు, ప్రముఖ నిర్మాణ సంస్థలు ఉన్నప్పటికీ, కొత్తవాళ్లతో తక్కువ బడ్జెట్‌లో ప్రయోగాత్మక సినిమాలు నిర్మించే ప్రయత్నాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయనే చర్చ మొదలైంది. ఇటీవల కొన్ని చిన్న సినిమాలు కంటెంట్ బలంతో భారీ విజయాలు సాధించినప్పటికీ, స్టార్ హీరోలు స్వయంగా ముందుకు వచ్చి అలాంటి ప్రాజెక్ట్‌లను నిర్మించడం మాత్రం తక్కువగానే ఉంది. అందుకే ధనుష్ చేస్తున్న ప్రయత్నాలను చూసి భరణి ప్రశంసించడం వెనుక పెద్ద సందేశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి ధనుష్‌పై తనికెళ్ల భరణి చేసిన ప్రశంసలు ఇప్పుడు సోషల్ మీడియాలో మాత్రమే కాదు, సినీ పరిశ్రమలో కూడా ఆలోచనలకు దారి తీస్తున్నాయి.

## ఇంకా సమానత్వం రాలేదు: జ్యోతిక

పరిశ్రమలో సాంకేతికంగా.. కథల పరంగా ఎన్నో మార్పులు కనిపిస్తున్నా లింగ వివక్ష – బడ్జెట్ కేటాయింపుల విషయంలో ఇంకా సమానత్వం రాలేదని నటి జ్యోతిక అభిప్రాయపడ్డారు. తాజాగా ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో జ్యోతిక మహిళా ప్రధాన చిత్రాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లపై ముక్కుసూటిగా మాట్లాడారు. లేడీ ఓరియెంటెడ్ సినిమాలకు పరిశ్రమలో తగినంత బడ్జెట్ లభించడం లేదన్నారు. దీంతో కథలో సత్తా ఉన్నా? ఇతర పెద్ద నటీనటులను ఆయా ప్రాజెక్టులలో భాగం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక స్టార్ హీరో సినిమాకు వందల కోట్ల బడ్జెట్ ఇచ్చేందుకు వెనుకాడని నిర్మాతలు మహిళా నటి ప్రధాన పాత్రలో నటించే చిత్రానికి మాత్రం బడ్జెట్ పరిమితులు విధిస్తున్నారు. –మహిళా ప్రధాన చిత్రాలకు కేటాయించే బడ్జెట్ ఎంత తక్కువగా ఉంటుం దంటే? కేవలం కథానాయిక పారితోషికం , ప్రాథమిక నిర్మాణ ఖర్చులకే అది సరిపోతుంది. ఆ సినిమాలో కీలక పాత్రల కోసం మరో స్టార్ నటుడిని లేదా నటిని తీసుకుందామన్నా? బడ్జెట్ సహకరించదు అని కఠిన వాస్తవాన్ని ఎండగట్టారు. ఇదే ఇంటర్వ్యూలో జ్యోతికతో పాటు బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీ కూడా పాల్గొన్నారు.



## అర్ధరాత్రి నడిరోడ్డుపై
# పావలా శ్యామల

ప్రముఖ నటి పావలా శ్యామల పరిస్థితి రోజురోజుకూ మరింత దయనీయంగా మారుతోంది. అటు వృద్ధాప్య సమస్యలు, ఇటు అనారోగ్యం ఆమెను మరింత కుంగదీస్తున్నాయి. ప్రస్తుతం ఆర్కే ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న ఆమె శుక్రవారం రాత్రి అస్వస్థతకు లోనవగా చికిత్స కోసం కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. కానీ చికిత్సకు సరిపడా డబ్బు తన దగ్గర లేకపోవడంతో ఆస్పత్రి యాజమాన్యం ఆమెకు ట్రీట్‌మెంట్ చేసేందుకు నిరాకరించింది. అంతేకాకుండా ఓ క్యాబ్ ఎక్కించి ఆమెను బలవంతంగా పంపించేసింది. అయితే క్యాబ్ డ్రైవర్ సైతం ఆమెను మధ్యలోనే దింపేశాడు. కూకట్‌పల్లిలోని ఓ జంక్షన్ వద్ద రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై దించేసి నిర్దాక్షిణ్యంగా వెళ్లిపోయాడు. దీంతో అర్ధరాత్రి కటిక చీకటిలో దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ కూర్చుండిపోయింది. కాసేపటికి ఆమెను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు.. ఆమె ఆశ్రయం పొందుతున్న ఆర్కే ఫౌండేషన్‌కు సమాచారమివ్వడంతో వారు తనను సనత్‌నగర్‌లోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఒకప్పుడు తన నటనతో ఎంతోమందిని నవ్వించిన నటి ఇప్పుడిలా రోడ్డుపై దయనీయ స్థితిలో కనిపించడం చూసి సినీప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, పావలా శ్యామల పరిస్థితి తెలుసుకున్న ప్రముఖ నిర్మాత దిల్ రాజు.. సాయం చేయడం కోసం తన టీంను ఆసుపత్రికి పంపారు.



## సన్ నెక్స్ట్‌లో సతీ లీలావతి

దేవ్ మోహన్, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం "సతి లీలావతి". తాతినేని సత్య దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం మే 8న విడుదలైంది. పెద్దగా అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఇక విడుదలైన రెండు వారాల్లోపే ఈ సినిమా ఓటీటీ ఎంట్రీకి సిద్ధమైంది. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ హక్కులను సన్ నెక్స్ట్ సంస్థ సొంతం చేసుకుంది. అందులో భాగంగా మే 20 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు సంస్థ ప్రకటించింది.








## మీ నాన్న కండోమ్ వాడాల్సింది
### యూట్యూబర్ అన్వేష్‌పై మాధవీలత ధ్వజం


ప్రముఖ యూట్యూబర్, 'నా అన్వేషణ' ఫేమ్ అన్వేష్‌పై నటి, బీజేపీ నాయకురాలు మాధవీలత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల అన్వేష్ ఓ ఆధ్యాత్మిక గురువును (జగద్గురువు) ఉద్దేశించి చేసిన ఎగతాళి చేస్తూ వ్యాఖ్యలు చేశారని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా ఆమె చేసిన అత్యంత ఘాటు వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట తీవ్ర దుమారం రేపుతున్నాయి. సనాతన ధర్మాన్ని, పీఠాధిపతులను కించపరిచేలా మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని మాధవీలత స్పష్టం చేశారు. జగద్గురువును అవమానించడాన్ని తీవ్రంగా పరిగణించిన ఆమె, లైవ్ వీడియోలో మాట్లాడుతూ ఏమాత్రం సంకోచించకుండా బోల్డ్ పదజాలాన్ని ఉపయోగించారు. 'నిన్ను కనేముందు మీ నాన్న కండోమ్ వాడి ఉంటే.. ఈ రోజు సమాజానికి ఈ దరిద్రం వదిలేది' అంటూ అన్వేష్‌ను ఉద్దేశించి ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. పవిత్రమైన ఆధ్యాత్మిక గురువులను తక్కువ చేసి మాట్లాడటం అన్వేష్ అహంకారానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. 'నువ్వు ఎంతటి వాడివైనా సరే.. జగద్గురువుపై చేసిన వ్యాఖ్యలకు త్వరలోనే కర్మ అనుభవిస్తావు. దేవుడి స్క్రిప్ట్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది, నీ పతనం త్వరలోనే చూస్తావు' అంటూ ఆమె గట్టిగా హెచ్చరించారు. కాగా, 'నచ్చావులే', 'స్నేహితుడా' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్న మాధవీలత, కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉంటూ రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా హిందూ ధర్మం, సామాజిక అంశాలపై ఎవరైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే ఆమె వెంటనే స్పందిస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. తాజా వివాదంతో అటు అన్వేష్ అభిమానులకు, ఇటు మాధవీలత మద్దతుదారులకు మధ్య సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున మాటల యుద్ధం నడుస్తోంది. ఈ పరిణామం ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.



## హనుమాన్ 3డీ కోసం భారీ ప్లాన్

సూపర్ హీరో సినిమాలకు ప్రేక్షకుల్లో ఎప్పుడూ ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. అయితే భారతీయ పురాణాల స్ఫూర్తితో తెరకెక్కిన హను మాన్ సినిమా మాత్రం ఆ జానర్‌ను కొత్త స్థాయిని తీసుకెళ్లింది. చిన్న సినిమాగా విడుదలై దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని అందుకున్న ఈ సినిమా ఇప్పుడు మరింత భారీ అనుభూతితో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సూపర్ హీరో తేజ సజ్జ హీరోగా, డైరెక్టర్ ప్రశాంత్ వర్మ రూపొందించిన ఈ విజువల్ వండర్ జూన్ 25, 2026న 3డీ వెర్షన్‌లో ప్రపంచవ్యాప్తంగా రీ-రిలీజ్ కానుంది. ఇప్పటికే నేషనల్ అవార్డు అందుకుని, బాక్సాఫీస్ వద్ద అద్భుత రికార్డులు సృష్టించిన ఈ సినిమా ఇప్పుడు మరింత గ్రాండియర్‌గా ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా భారీ స్క్రీన్‌లపై 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా ఎలా ఉంటుందోనన్న ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో కీలకమైన సినిమాగా నిలిచిన హను మాన్ ను మళ్లీ థియేటర్లలో చూడాలని చాలా కాలంగా అభిమానులు కోరుకుంటుండగా, ఇప్పుడు ఆ కోరిక మరింత స్పెషల్ ఎక్స్‌పీరియన్స్ రూపంలో నెరవేరబోతోంది. భారతీయ పురాణాలు, ఆధునిక విజువల్ ఎఫెక్ట్స్, సూపర్ హీరో ఎలిమెంట్స్‌ను కలిపి రూపొందించిన హను మాన్ మొదటి రిలీజ్ టైమ్ లోనే ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు 3డీ వెర్షన్ కోసం చిత్ర బృందం పలు టెక్నికల్ డెవలప్‌మెంట్స్ చేసినట్లు సమాచారం.







# ఫిన్, రఘువంశీ విధ్వంసం

## గుజరాత్‌పై కోల్‌కతా విజయం.. ప్లే ఆఫ్స్ రేసులో రహానే సేన

**పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ పోరులో కోల్‌కతా నైట్ రైడర్స్ నిలిచింది. గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్ కు షాకిస్తూ కీలకమైన రెండు పాయింట్లు సాధించింది.**

శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో ఫిన్ అలెన్(93), రఘువంశీ(82 నాటౌట్)లు తుఫాన్ ఇన్నింగ్స్‌తో 247 రన్స్ కొట్టిన కోల్‌కతా.. ఆపై ప్రత్యర్థిని కట్టడి చేసింది. శుభ్‌మన్ గిల్(85), బట్లర్() అర్ధశతకాలతో పోరాడినా సరిపోలేదు. ఈ విజయంతో రహానే బృందం ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ఐపీఎల్ 19లో ప్లే ఆఫ్స్ రేసు రోజురోజుకు ఆసక్తికరంగా సాగుతోంది. ఇక కష్టమే అనుకున్న జట్లు సంచలన విజయాలతో ముందున్న జట్లకు షాకిస్తున్నాయి. మొన్న ముంబై ఇండియన్స్, నిన్న లక్నో సూపర్ జెయింట్స్ .. ఈరోజు కోల్‌కతా నైట్ రైడర్స్ సూపర్ విక్టరీతో నాకౌట్ పోరును ఉత్కంఠగా మార్చేశాయి. తొలుత గుజరాత్ బౌలర్ల భరతం పడుతూ ఓపెనర్ ఫిన్ అలెన్(93), రఘువంశీ(82 నాటౌట్)లు భారీ స్కోరందించగా.. అనంతరం బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు. భారీ ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్లు సాయి సుదర్శన్(23) శుభ్‌మన్ గిల్(85) దూకుడుగా ఆడారు. కానీ, బంతి చేతికి తగిలి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. నిశాంత్ సింధు(1)ను నరైన్ ఔట్ చేశాడు. జోస్ బట్లర్(57) గిల్ గెలుపు బాధ్యత తీసుకున్నారు. బౌండరీలతో చెలరేగిన కెప్టెన్ 33 బంతుల్లో అర్ధ శతకం అందుకోగా.. బట్లర్ సైతం బాదేశాడు. శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని నరైన్ విడదీశాడు. అప్పటికీ గుజరాత్ విజయానికి 22 బంతుల్లో 71 పరుగులు కావాలి. తిరిగి బ్యాటింగ్‌కు వచ్చిన సుదర్శన్, బట్లర్‌తో కలిసి ప్రయత్నించినా గుజరాత్‌ను గెలిపించలేకపోయాడు. చివరి ఓవర్లో 40 రన్స్ అవసరమవ్వగా.. గుజరాత్ 218కే పరిమితమైంది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 12 | 8 | 4 | 16 |
| గుజరాత్ | 13 | 8 | 5 | 16 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 14 |
| పంజాబ్ | 12 | 6 | 5 | 13 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| చెన్నై | 12 | 6 | 6 | 12 |
| కోల్‌కతా | 12 | 5 | 6 | 11 |
| ఢిల్లీ | 12 | 5 | 7 | 10 |
| ముంబై | 12 | 4 | 8 | 8 |
| లక్నో | 12 | 4 | 8 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు




## ఐపీఎల్‌లో ఈ చిట్టీల లొల్లేంది?: రాయుడు

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్ ఆకాశ్ సింగ్ చేసుకున్న 'చిట్టీ' సెలబ్రేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ తరహా సంబరాలను వెంటనే నిషేధించాలని భారత మాజీ ఆటగాడు, చెన్నై మాజీ బ్యాటర్ అంబటి రాయుడు తీవ్రంగా స్పందించాడు. ఈ మ్యాచ్‌లో లక్నో ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించగా, ఆకాశ్ సింగ్ 26 పరుగులిచ్చి 3 వికెట్లతో రాణించాడు. అయితే, అతను వికెట్ తీసిన ప్రతిసారీ తన జేబులోంచి ఒక చిన్న చిట్టీ తీసి కెమెరాలకు చూపించాడు. దానిపై 'టీ20 గేమ్‌లో వికెట్లు ఎలా తీయాలో ఆకాశ్‌కు తెలుసు' అని రాసి ఉంది. ఈ సెలబ్రేషన్ సోషల్ మీడియాలో వైరల్ అయినప్పటికీ, పలువురు మాజీ క్రికెటర్ల నుంచి విమర్శలు ఎదుర్కొంది. ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో షోలో మాట్లాడిన అంబటి రాయుడు.. 'ఈ చిట్టీల వ్యాపారాన్ని నిషేధించాలి.



## ఐపీఎల్ మధ్యలో మహీకాతో హార్దిక్ పెళ్లి?

ముంబై ఇండియన్స్ కెప్టెన్, టీమ్ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ 2026 సీజన్ మధ్యలో రెండో పెళ్లి చేసుకోబోతున్నాడనే వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. తన గర్ల్‌ఫ్రెండ్ మహీకా శర్మతో అతడు మళ్లీ పెళ్లిపీటలు ఎక్కబోతున్నాడంటూ పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఇప్పుడు ఈ వదంతులు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. అయితే విశ్వసనీయ వర్గాల ప్రకారం.. వీటిల్లో నిజం లేదని తెలుస్తోంది. మరోవైపు వెన్నునొప్పి కారణంగా హార్దిక్ పాండ్యా ముంబై ఆడిన గత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడులేని సమయంలో సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా జట్టు బాధ్యతలు చేపట్టారు. హార్దిక్ నాయకత్వంపై మేనేజ్‌మెంట్ అసంతృప్తితో ఉందనే ప్రచారం జరుగుతున్న తరుణంలోనే పెళ్లి వదంతులు బయటకు రావడం గమనార్హం. మహీకా శర్మ గతంలో ముంబై ఇండియన్స్ టీమ్ బస్సులో ప్రయాణించడంతో పాటు మార్చిలో జరిగిన టీ20 వరల్డ్ కప్ వేడుకల్లోనూ పాల్గొనడం ఈ వదంతులకు మరింత బలాన్ని చేకూర్చింది.

## ఐపీఎల్ టికెట్ కొంటున్నారా.. జాగ్రత్త!: సజ్జనార్

ఐపీఎల్ 2026లో భాగంగా ఈ నెల 22న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ జరగనుంది. విరాట్ కోహ్లీ ఉప్పల్ రానుండటంతో.. ఈ మ్యాచ్ కువిపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీంతో ఈ మ్యాచ్ టికెట్ల కోసం అభిమానులు పెద్ద ఎత్తున వెయిట్ చేస్తున్నారు.



ఈ క్రమంలో మ్యాచ్ టికెట్లకు ఉన్న క్రేజ్‌ను సైబర్ కేటుగాళ్లు ఆసరాగా చేసుకుంటున్నారు. ఐపీఎల్ టికెట్ల కోసం అభిమానుల్లో ఉన్న విపరీతమైన డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని, నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్ల ద్వారా దోపిడీకి తెరలేపారు. సోషల్ మీడియా వేదికగా అసలు యాప్‌ను తలపించేలా ఉన్న నకిలీ లింకులను క్లిక్ చేసి టికెట్లు బుక్ చేసుకుంటే మీ సొమ్ము గల్లంతవ్వడం ఖాయమని నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. ఐపీఎల్ అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను పోలిన రంగులు, లోగోలతో సైబర్ నేరగాళ్లు ఈ నకిలీ యాప్‌లను సృష్టించి, తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఇలాంటి వాటిలో పేమెంట్ చేసిన తర్వాత టికెట్లు రాకపోగా, మీ బ్యాంకింగ్ వివరాలు కూడా సైబర్ నేరగాళ్ల పరమయ్యే ప్రమాదం ఉందని సీపీ స్పష్టం చేశారు. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక లింకులను నమ్మి మోసపోవద్దని, ఇలాంటి ఫేక్ యాప్‌లపై నిఘా ఉంచామని తెలిపారు.



## పంజాబ్‌కు రెండు హోం గ్రౌండ్స్ ఏంటి?: అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు వరుస ఓటములతో ఇబ్బంది పడుతుండడంపై టీమ్ఇండియా స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో గెలిచిన పంజాబ్.. తర్వాత వరుసగా ఐదింట్లో ఓడిపోయింది. దీనికి జట్టు యాజమాన్యం తీసుకున్న తప్పుడు నిర్ణయాలే కారణమని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో మండిపడ్డాడు. ఒకే సీజన్‌లో ముల్లాన్‌పూర్, ధర్మశాల అంటూ రెండు వేర్వేరు స్టేడియాలను హోమ్ గ్రౌండ్స్‌గా ఎంచుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టాడు. ఐపీఎల్‌లో అత్యధిక ట్రోఫీలు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ లాంటి జట్లు ఎప్పుడైనా హోమ్ గ్రౌండ్స్ మార్చాయా అని అశ్విన్ ప్రశ్నించాడు. మొహాలీలో ఐదు మ్యాచ్‌లు గెలిచిన తర్వాత అకస్మాత్తుగా వేదిక మారడం వల్లే టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాల్సిన ప్రమాదం ఏర్పడిందని తెలిపాడు. బయట నుంచి చూసేవాళ్లకు పంజాబ్ సరిగా ఆడడంలేదని అనిపించొచ్చని, కానీ హోమ్ గ్రౌండ్స్ మార్చడం ముమ్మాటికీ తప్పని స్పష్టం చేశాడు.

## ఫైనల్లో సాత్విక్ జోడీ

భారత స్టార్ డబుల్స్ షట్లర్లు సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి, చిరాగ్ శెట్టి థాయిలాండ్ ఓపెన్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచారు. టోర్నీలో సంచలన ప్రదర్శన చేస్తున్న ఈ భారత జంట శనివారం ఫైనల్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సాత్విక్ జోడీ 19-21, 22-20, 21-16 తేడాతో మలేసియాకు చెందిన గో స్జె ఫే-నూర్ ఇజ్జుద్దీన్ జంటపై అద్భుత విజయం సాధించింది. గంటా 22 నిమిషాలపాటు సుదీర్ఘంగా సాగిన మ్యాచ్‌లో సాత్విక్, చిరాగ్ ఫైనల్ చేరుకోవడానికి తీవ్రంగా శ్రమించారు. తొలి గేములో పోరాడినప్పటికీ నిరాశే ఎదురైంది. కానీ, ఆ తర్వాత బలంగా పుంజుకున్నారు. ప్రత్యర్థుల నుంచి ప్రతిఘటన ఎదురైనప్పటికీ పట్టుదల ప్రదర్శించారు. మలేసియా ప్లేయర్లను రెండు, మూడు గేముల్లో నిలువరించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నారు. సాత్విక్ జోడీ ఈ సీజన్‌లో ఓ టోర్నీలో ఫైనల్‌కు చేరుకోవడం ఇదే తొలిసారి. 2024లో భారత జంట తొలిసారి థాయిలాండ్ ఓపెన్ గెలిచింది. ఈ సారి రెండో టైటిల్‌ను దక్కించుకోవాలని చూస్తోంది. ఆదివారం జరిగే ఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన లియో రోలీ కార్నాండో-డానియెల్ మార్టిన్ జోడీతో తలపడనుంది.



ఈవార్తలు
# ప్రజావాణి
ఆదివారం 17-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

## నాడు టెలిగ్రాఫ్.. నేడు కృత్రిమ మేధ

1865 మే 17వ తేదీన పారిస్‌లో కేవలం 20 దేశాలు కలిసి మొదటి 'అంతర్జాతీయ టెలిగ్రాఫ్ కన్వెన్షన్' మీద సంతకం చేశాయి. నాడు సమాచారాన్ని ఒక చోటు నుండి మరో చోటుకి చేర్చడానికి గంటలు, రోజులు పట్టేది. ఆనాడు పడిన తొలి సంతకం కేవలం ఒక ఒప్పందం కాదు, నేటి ప్రపంచాన్ని ఒకే గ్లోబల్ విలేజ్‌గా మార్చిన మహా విప్లవానికి నాంది. నాడు టెలిగ్రాఫ్ వైర్ల గుండా సాగిన ప్రయాణం.. నేడు ఉపగ్రహాలు, 5జీ నెట్‌వర్క్‌లు, క్వాంటం కంప్యూటింగ్, మరియు కృత్రిమ మేధ స్థాయికి చేరుకుంది. నాడు సమాచారాన్ని 'పంపడం' ఒక సవాలు అయితే, నేడు సమాచార 'వరద'ను నియంత్రించడం ఒక సవాలుగా మారింది. నాడు అక్షరాల రూపంలో నెమ్మదిగా సాగిన టెలిగ్రాఫ్ సంకేతాల స్థానంలో, నేడు సెకనుకు గిగాబైట్ల డేటా కాంతి వేగంతో ప్రపంచాన్ని చుట్టేస్తోంది. నాడు కార్యాలయాలకే పరిమితమైన కమ్యూనికేషన్, నేడు ప్రతి ఒక్కరి అరచేతిలో స్మార్ట్‌ఫోన్ రూపంలో ఇమిడిపోయింది. నాడు మనుషులు మాత్రమే సమాచారాన్ని విశ్లేషించేవారు. నేడు మనుషుల కంటే వేగంగా క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ డేటాను ప్రాసెస్ చేసి నిర్ణయాలు తీసుకుంటున్నాయి. సాంకేతికత ఎంతగా పరిణతి చెందినా, దానితో పాటు కొన్ని సరికొత్త సవాళ్లు కూడా పుట్టుకొచ్చాయి. ఒకవైపు ప్రపంచం 6జీ వైపు అడుగులు వేస్తున్నా, ఇప్పటికీ ప్రపంచ జనాభాలో దాదాపు మూడో వంతు మందికి ప్రాథమిక ఇంటర్నెట్ సౌకర్యం లేదు. డీప్‌ఫేక్స్, సైబర్ దాడులు, నకిలీ వార్తల వ్యాప్తి నేటి సమాజానికి పెద్ద ముప్పుగా మారాయి. మునుపెన్నడూ లేని విధంగా వ్యక్తుల సమాచారం కార్పొరేట్ కంపెనీల చేతుల్లో చిక్కుకుని వాణిజ్య వస్తువుగా మారుతోంది. 1865లో టెలికమ్యూనికేషన్స్ అనేది కేవలం దేశాల సరిహద్దులను దాటడానికి ఉపయోగపడింది. కానీ నేడు అది మానవ జీవన విధానాన్ని శాసిస్తోంది. టెక్నాలజీ వినియోగం పరంగా మనం ఎంతో పరిణతి సాధించినప్పటికీ, ఆ సాంకేతికత అందరికీ సమానంగా అందనంతవరకు ఆ ప్రగతికి సంపూర్ణ అర్థం చేకూరదు. సాంకేతికతను కేవలం వ్యాపార కోణంలోనే కాకుండా, సామాజిక శ్రేయస్సు కోసం, మానవీయ విలువలతో కూడిన భద్రతతో వాడుకున్నప్పుడే నాడు పడిన తొలి సంతకానికి, నేటి ఆధునిక ఆవిష్కరణలకు నిజమైన సార్థకత లభిస్తుంది.




## నిప్పుల కుంపటిగా భూగోళం

భూతాపం పెరిగిపోతోంది. ఏటా వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలను దాటుకుంటూ పోతున్నాయి. నిన్న మొన్నటి వరకు సాధారణంగా భావించిన ఎండలు, ఇప్పుడు వడగాల్పులు మరియు తీవ్రమైన వాతావరణ మార్పులతో మానవ మనుగడకే సవాలు విసురుతున్నాయి. పచ్చని చెట్లను నరికి కాంక్రీట్ వనాలను నిర్మించడం, మితిమీరిన కాలుష్యం మరియు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీయడమే ఇందుకు ప్రధాన కారణాలని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలోని పలు నగరాల్లో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్‌ను దాటిపోతున్నాయి. ఉదయం 9 గంటలకే బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి కోసం జనం అల్లాడుతున్నారు. వడదెబ్బ, నీరసం మరియు చర్మవ్యాధులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రకృతిని మన అవసరాల కోసం వాడుకోవడం విస్మరించి, విలాసాల కోసం నాశనం చేస్తున్నాం. అడవుల నరికివేత, వాహనాలు మరియు పరిశ్రమల నుంచి వెలువడే కర్బన ఉద్గారాలు భూగోళాన్ని గ్రీన్‌హౌస్ ముప్పులోకి నెట్టేస్తున్నాయి. పట్టణీకరణ పేరుతో చెరువులను, కుంటలను పూడ్చివేయడం వల్ల పర్యావరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ది హిందూ పత్రిక కథనం ప్రకారం, పెరుగుతున్న వాతావరణ మార్పులకు తక్షణమే స్పందించకపోతే భవిష్యత్తులో గృహాల లోపల కూడా సురక్షితమైన ఉష్ణోగ్రతలను కలిగి ఉండటం ఒక పెద్ద సవాలుగా మారనుంది. ప్రభుత్వాలు కేవలం చట్టాలు, నిబంధనలకు పరిమితం కాకుండా పర్యావరణ సమతుల్యత కోసం కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఇందులో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకం. 'ప్రతి ఒక్కరూ ఒక మొక్క' నాటడమే కాకుండా, దానిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి.వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి. విద్యుత్ వినియోగాన్ని తగ్గించి, సౌరశక్తి వంటి ప్రత్యామ్నాయ మార్గాల వైపు మొగ్గు చూపాలి. పర్యావరణానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలి. ప్రకృతిని మనం కాపాడితే, ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుంది. ప్రస్తుత వాతావరణ హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే మున్ముందు తరాలు ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులు వస్తాయి. కాబట్టి, ఇప్పటికైనా పాలకులు, ప్రజలు మేల్కొని పర్యావరణాన్ని రక్షించే బాధ్యతను ఒక ఉద్యమంగా చేపట్టాలి. అప్పుడే రాబోయే తరాలకు మనం పచ్చని, సురక్షితమైన భూగోళాన్ని అందించగలం.



అలేఖ్య



## నిశ్శబ్ద హంతకురాలు.. రక్తపోటు

మారుతున్న ఆధునిక జీవనశైలి, విపరీతమైన మానసిక ఒత్తిడి కారణంగా రక్తపోటు (బీపీ) ఒక మహమ్మారిలా విస్తరిస్తోంది. వైద్య పరిభాషలో దీనిని సైలెంట్ కిల్లర్ (నిశ్శబ్ద హంతకుడు) అని పిలుస్తారు. ఎందుకంటే, ఇది శరీరంలో ఉన్నప్పటికీ ఎలాంటి ముందస్తు సంకేతాలు చూపించకుండానే అంతర్గతంగా అవయవాలను దెబ్బతీస్తుంది. రక్తపోటు నిర్వహణ అనేది కేవలం ఒక వ్యక్తి బాధ్యత మాత్రమే కాదని, కుటుంబం, సమాజం, వైద్య వ్యవస్థలు కలిసికట్టుగా చేయాల్సిన పోరాటం. రక్తపోటు ఉధృతి ఆందోళనకరంగా ఉంది.



డాక్టర్ మనోజ్ రెడ్డి

ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత వైద్య పరిశోధనా మండలి వెల్లడించిన గణాంకాలు అందుకు సాక్ష్యాలు. సాధారణంగా ఏ జబ్బుకైనా ఏదో ఒక రూపంలో లక్షణాలు కనిపిస్తాయి. కానీ, రక్తపోటు తీవ్రస్థాయికి చేరేవరకు చాలా మందిలో ఎలాంటి స్పష్టమైన సంకేతాలు కనిపించవు. తలనొప్పి, కళ్లు తిరగడం, ముక్కు నుంచి రక్తం కారడం, అలసట వంటి సాధారణ లక్షణాలను చాలామంది నిర్లక్ష్యం చేస్తారు. ఈ నిర్లక్ష్యమే అకాల మరణాలకు దారితీస్తోంది. రక్తపోటు నియంత్రణలో లేకపోతే గుండెపోటు, పక్షవాతం, కిడ్నీలు పాడైపోవడం వంటి సమస్యలు వస్తాయి. గుండె రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి గుండె వైఫల్యానికి దారితీస్తుంది. భారత్‌లో సంభవిస్తున్న మొత్తం మరణాలలో మూడింట ఒక వంతు గుండె జబ్బుల వల్లే జరుగుతున్నాయి. మెదడులోని రక్తనాళాలు పగిలిపోవడం లేదా బ్లాక్ అవ్వడం వల్ల పక్షవాతం వస్తుంది. మూత్రపిండాలలోని సూక్ష్మ రక్తనాళాలు దెబ్బతిని, కిడ్నీ ఫెయిల్యూర్ సంభవిస్తుంది.

### యువతలో పెరుగుతున్న ముప్పు

ఒకప్పుడు వృద్ధులలో మాత్రమే కనిపించే ఈ సమస్య, నేడు ఐటీ ఉద్యోగులు, పట్టణ యువతను సైతం వేధిస్తోంది. దేశీయంగా యువకుల్లో దాదాపు 30% మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నారు. జంక్ ఫుడ్స్, ప్రాసెస్ చేసిన నిల్వ పచ్చళ్లు, ఫాస్ట్ ఫుడ్స్ వల్ల ఆహారంలో ఉప్పు (సోడియం) మోతాదుకు మించి శరీరంలోకి చేరుతోంది. దీంతో రక్తపోటు సమస్యలు వస్తున్నాయి. గంటల తరబడి కంప్యూటర్ల ముందు కూర్చోవడం, శారీరక శ్రమ లేదా కనీస వ్యాయామం లేకపోవడం కూడా కారణాలు. ధూమపానం, విపరీతమైన మద్యపానం, రాత్రి వేళల్లో నిద్రలేమి, కెరీర్, ఉద్యోగ నిర్వహణలో ఎదురవుతున్న తీవ్రమైన మానసిక ఆందోళనలతో బీపీ వస్తోంది. రక్తపోటును నియంత్రించడంలో నిరంతర పర్యవేక్షణ, జీవనశైలి మార్పులే కీలక ఆయుధాలు. ఇందుకోసం 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కనీసం ఏడాదికి రెండుసార్లైనా బీపీ పరీక్ష (సాధారణ రీడింగ్ 120/80 ఎంఎంహెచ్‌జీ ఉండాలి) చేయించుకోవాలి. రోజువారీ ఆహారంలో ఉప్పు శాతాన్ని ఐదు గ్రాముల లోపుకు పరిమితం చేయాలి. పొటాషియం ఎక్కువగా ఉండే పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలి. వారంలో కనీసం 5 రోజులు, ప్రతిరోజూ 30 నుండి 45 నిమిషాల పాటు వేగంగా నడవడం (బ్రిస్క్ వాకింగ్), యోగా లేదా వ్యాయామం చేయాలి. ఒకవేళ రక్తపోటు ఉన్నట్లు నిర్ధారణ అయితే, వైద్యుల సలహా మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలి. బీపీ అదుపులోకి వచ్చింది కదా అని సొంత నిర్ణయాలతో మందులు ఆపడం ప్రాణాంతకం. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇండియా హైపర్‌టెన్షన్ కంట్రోల్ ఇనిషియేటివ్ వంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో బీపీ గుర్తింపునకు సహాయపడుతున్నాయి. అయితే, ప్రభుత్వ ప్రయత్నాలతో పాటు వ్యక్తిగత బాధ్యత కూడా తోడైనప్పుడే ఈ నిశ్శబ్ద హంతకుడిని మనం ఓడించగలం.

### గణాంకాలు:

- ప్రపంచవ్యాప్త బాధితుల సంఖ్య – సుమారు 140 కోట్ల మంది
- భారతదేశంలో బాధితుల సంఖ్య– సుమారు 31.5 కోట్ల మంది (ఐసీఎంఆర్ నివేదిక
- భారతదేశంలో సగటు శాతం– ప్రతి నలుగురు పెద్దవారిలో ఒకరికి (25%)
- భారత్‌లో బీపీ అదుపులో ఉన్నవారి శాతం – కేవలం 12% మాత్రమే
- ముందస్తు అవగాహన లేని వారి శాతం – దాదాపు 50% మందికి తమకు బీపీ ఉందనే తెలీదు
- యువతలో (45 ఏళ్ల లోపు) ముప్పు శాతం–దాదాపు 26% నుండి 30% మంది బాధితులు

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.